



ఎమ్మెల్యేలతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం సిద్దరామయ్య

## బోర్‌వెల్ పనుల కోసమే..!

- జిలెటిన్ స్టిక్స్ తరలింపు కేసుపై కమిషనర్ సీమంతకుమార్ సింగ్
- ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు



పట్టుబడిన పేలుడు పదార్థాలు (ఫైల్)

బెంగళూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): కలాసిపాళ్య బస్టాండ్‌లో పేలుడు పదార్థాలు ఉంచిన కేసులో ముగ్గురిని అరెస్టు చేశారు. ఈనెల 23న మధ్యాహ్నం కలాసిపాళ్యలోని శౌచాలయం సమీపాన ఓ సంచిలో జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్‌లు లభించాయి. వాటిని ఎవరు ఉంచారనే కోణంలో విచారణ జరిపిన పోలీసులు నిందితులు గణేశ్, శివ, మునియప్పలను మంగళవారం అరెస్టు చేశారు. బోర్‌వెల్ పనులకోసం కోలారు నుంచి చామరాజనగర జిల్లా కొళ్ళేగాలకు వాటిని తరలిస్తున్నారు. ఓ సంచిలో వాటిని తీసుకొచ్చిన వారు శౌచాలయానికి వెళ్లారు. ఈలోగానే పోలీసులు సంచిని గుర్తించి విచారణ జరిపారు. బోర్‌వెల్ పనుల కోసమే జిలెటిన్‌స్టిక్స్‌ను తీసుకొచ్చారని, వీరికి ఎక్కడా నేర చరిత్ర లేదని నగర పోలీస్ కమిషనర్ సీమంతకుమార్‌సింగ్ మీడియాకు తెలిపారు. గనుల తవ్వకాలు, బోర్‌వెల్ పనులకు వీటిని ఉపయోగించాలని నిర్ణయించారు. అనుమతి లేకుండా జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్లు ఉపయోగించరాదని, పైగా రవాణా కూడా నిషిద్ధమన్నారు. వారినుంచి 22 జిలెటిన్‌స్టిక్స్, 30 ఎలక్ట్రిక్ డిటోనేటర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## కన్నడనాడుకు ఖర్గే..!



- ఢిల్లీ వీడి రాష్ట్ర రాజకీయాల్లోకి..!
- భావోద్వేగ వ్యాఖ్యలతో జోరుగా ఊహాగానాలు
- తెరపైకి దళిత సీఎం ● ఆయన బాధలో తప్పు లేదు: డీసీఎం డీకే
- అన్ని పదవులకు అర్హుడు: హోంమంత్రి పరమేశ్వర్

బెంగళూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో దిగ్గజనేతగా కొనసాగుతూ రాజ్యసభలో ప్రతిపక్షనేతగా వ్యవహరిస్తున్న మల్లికార్జున ఖర్గే రెండు రోజులక్రితం విజయపురలో చేసిన వ్యాఖ్యలు పలు మలుపులు తిరుగుతున్నాయి. 1999లో మల్లికార్జున ఖర్గే కేపీసీసీ సారథిగా కొనసాగుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడేందుకు కారకుడయ్యారు. అప్పటికే ఆయన కొన్నేళ్ల కాలంగా క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగారు. అధ్యక్షుడిగా ఉన్నందున ముఖ్యమంత్రి అవుతానని కలలు కన్నారు. కానీ అధిష్ఠానం అనూహ్యంగా ఎస్ఎం కృష్ణను సీఎంగా ప్రకటించింది. ఈ ప్రస్తావన రాష్ట్ర రాజకీయాల్లో ఇతర నేతలు లేవనెత్తడం కొత్తేమీకాదు. కానీ స్వయంగా మల్లికార్జున ఖర్గే తన గత చేదు అనుభవాన్ని భావోద్వేగంతో వ్యక్తం చేశారు. అప్పటికే ఐదేళ్ల పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించిన తనను కాదని, కేవలం కొన్ని నెలలక్రిందట తెరపైకి వచ్చిన ఎస్ఎంకృష్ణకు ముఖ్యమంత్రి పదవి వరించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో మరో నెలలో మార్పులు ఉంటాయని, లేదా నవంబరులో ప్రక్షాళన అని, నాయకత్వ మార్పు ఉంటుందనే చర్చలు సాగుతున్నాయి. వీటన్నింటికీ చెక్ పెట్టేలా సీఎం సిద్దరామయ్య ఐదేళ్లు తానే సీఎంగా ఉంటానని ప్రకటించారు. ఇది రాష్ట్ర కాంగ్రెస్‌లో భిన్నమైన చర్చకు కారణమైంది. రెండేళ్లుగా డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పదవి వరిస్తుందని ఆశలు పెట్టుకున్నారు. ఐదేళ్లు సిద్దరామయ్య సీఎంగా ఉంటారని గతంలో పలువురు మంత్రులు వ్యాఖ్యానించారు. ఆ వెంటనే అధిష్ఠానం ద్వారా మందలింపచేసేవారు. కానీ సిద్దరామయ్య స్వయంగా ప్రకటించడంతో డీకే శివకుమార్ నిరాశ చెందారు. ఇలా సాగుతుండగానే ఖర్గే వ్యాఖ్యలకు భిన్నమైన అర్థాలు వినిపిస్తున్నాయి. డీసీఎం డీకే శివకుమార్ స్పందిస్తూ ఖర్గే మనసులోని మాట చెప్పారని, ఆయనకు జరిగిన అనుభవాన్ని పంచుకున్నారని, అది భావోద్వేగమై ఉండవచ్చునన్నారు. రాష్ట్ర రాజకీయాలకు వచ్చినా తప్పు లేదన్నారు. ఇక హోం మంత్రి పరమేశ్వర్ కూడా అదే తరహాలోనే మాట్లాడారు. ఖర్గే ప్రస్తుతం కాంగ్రెస్ అగ్రనేతగా ఉన్నారని, ఒక ముఖ్యమంత్రిని నియమించే హోదాలో ఉన్నారన్నారు. ఆయన అన్ని పదవులకు అర్హుడని, అంతటి అనుభవం ఉందన్నారు. ఖర్గే వ్యాఖ్యలను తప్పుబట్టాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రానికి వస్తానంటే తప్పేం ఉందన్నారు. 2013 నుంచి 2018 మధ్య కాలంలో కాంగ్రెస్ పార్టీ సిద్దరామయ్య నేతృత్వంలో పాలన సాగింది. అప్పట్లోనూ దళిత సీఎం ప్రస్తావన రెండు మూడు సందర్భాలలో వచ్చింది. అవకాశం దక్కలేదు. ప్రస్తుతం ముఖ్యమంత్రి మార్పు అనే అంశం చర్చ సాగుతున్న తరుణంలో మరోసారి తెరపైకి దళిత సీఎం ప్రస్తావన వచ్చింది. దీంతో ఖర్గే రాష్ట్రానికి తిరిగి వస్తారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి.

## భేటీలో సీఎం ఒక్కరే..!

- ఎమ్మెల్యేలతో సమీక్ష ప్రారంభించిన ముఖ్యమంత్రి
- డీసీఎం లేకుండానే సమావేశాలు
- ఆహ్వానం అందకపోవడంపై సర్వత్రా ఆశ్చర్యం

బెంగళూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల తర్వాత సీఎం సిద్దరామయ్య తొలిసారి ఎమ్మెల్యేలతో భేటీ అవుతున్నారు. మంగళవారం మైసూరు, చామరాజనగర, తుమకూరు జిల్లాల ఎమ్మెల్యేలతో ఆయన సమీక్షా సమావేశం జరిపారు. సాధారణంగా ఎటువంటి సమావేశమైనా సీఎంతోపాటు డీసీఎం డీకే శివకుమార్ పాల్గొనేవారు. కానీ ఎమ్మెల్యేల సమీక్షకు డీసీఎంను ఆహ్వానించకపోవడం కొత్త వివాదాలకు తావిస్తోంది. ఇప్పటివరకు రెండేళ్ల వ్యవధిలో ఎటువంటి సభ, సమీక్ష అయినా సీఎంతోపాటు డీసీఎం పాల్గొనేవారు. డీకే శివకుమార్ అందుబాటులో లేకుంటే సీఎం ఒక్కరే ఉండేవారు. కానీ తాజా పరిణామం సర్వత్రా చర్చకు కారణమవుతోంది. రాష్ట్రంలో నాయకత్వ మార్పు అంశం తెరపైకి వచ్చాక ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిని అంటూ సిద్దరామయ్య ప్రకటించారు. అంతకంటే డీకే శివకుమార్‌కు ఎమ్మెల్యేల మద్దతు లేదనే వ్యాఖ్యలు మరింత అగాధమయ్యేందుకు కారణమైంది. తాజాగా ఎమ్మెల్యేలతో సమీక్షకు డీకే శివకుమార్ లేకుండానే నిర్వహించడం వివాదాన్ని మరింత జటిలం చేసినట్టు అవుతోంది. సీఎం జరుపుతున్న సమీక్షలపై డీసీఎం డీకే శివకుమార్ స్పందించారు. సీఎం అధికారాన్ని ప్రయోగించి ఎమ్మెల్యేల సభ జరుపుతున్నానని ఇందులో తప్పేమీ లేదన్నారు. తనకు ఆహ్వానం లేకపోవడం కూడా అభ్యంతరం లేదన్నారు. పార్టీ ఇన్‌చార్జ్ సుర్జేవాలా ఎమ్మెల్యేలతో చర్చల తర్వాత పలు అంశాలు ప్రస్తావించారని, వాటిని పరిష్కరించేందుకు సీఎం సమీక్ష చేస్తున్నారని ఇందులో తప్పేమీ లేదన్నారు. తనకు లేని కష్టం, అసంతృప్తి మీడియాకు ఎందుకు వచ్చిందని ఎదురు ప్రశ్నించారు. కాగా ఎమ్మెల్యేల సమీక్షా సమావేశంలో మైసూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప పాల్గొన్నారు. తుమకూరు జిల్లాకు సంబంధించి సమీక్ష వేళ మంత్రులు పరమేశ్వర్, రాజణ్ణలు పాల్గొన్నారు. నియోజకవర్గాల వారీగా అభివృద్ధి పనులను సమీక్షించారు.


రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముడి దుర్మరణం / చెత్త వాహనం ఢీకొని బాలుడి మృతి / జంబునాథ ఆలయంలో ఎలుగుబంటి సంచారం వివరాలు 8లో..


## రైతుల కడుపు కొట్టి బ్లాక్‌మార్కెట్‌కు..



తుమకూరులో ఆందోళన చేస్తున్న రైతులు, బీజేపీ నాయకులు



ర్యాలీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

- కేంద్రం నుంచి వచ్చిన ఎరువులను పక్కదారి పట్టిస్తున్నారు
- అన్నదాత కష్టాలు ప్రభుత్వానికి పట్టడం లేదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఆగ్రహం
- యూరియా కొరతపై రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ నిరసన

బెంగళూరు, జూలై29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి కేంద్రం పంపిన ఎరువులును బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని, రైతుల కష్టాలపై ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మండిపడ్డారు. రాష్ట్రంలో మంచి వర్షాలు కురిసి పంటల సాగుకు అనుకూలం ఉండగా ఎరువుల కొరతతో రైతులు ఇబ్బంది పడుతుండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎరువుల కొరతను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆందోళన చేపట్టింది. తుమకూరు, చిత్రదుర్గ, దావణగెరె జిల్లాల్లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర నేతృత్వంలో నిరసనలు కొనసాగాయి.

### తుమకూరులో భారీ నిరసన

బీజేపీ రైతుమోర్చా ఆధ్వర్యంలో తుమకూరులో భారీ నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఇస్తున్న ఎరువులు, యూరియాను బ్లాక్ మార్కెట్‌కు విక్రయించి అన్నదాతలకు మోసం చేస్తున్నారని ఆరోపించారు. తుమకూరు టౌన్‌హాల్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ ప్రారంభించారు. జిల్లాధికారి కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. వేలాదిమంది కార్యకర్తలు, రైతులు నిరసనలో పాల్గొన్నారు. మంగళూరులో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరతాళు హాలప్ప, ఎమ్మెల్యేలు సురేశ్‌గౌడ, జ్యోతి గణేశ్, ఎమ్మెల్సీ చిదానందగౌడ, మాజీ ఎమ్మెల్యేలు ఎండీ లక్ష్మీనారాయణ, మసాలా జయరాం తదితరులు భాగస్వామ్యులయ్యారు. బావుటాలు చేతబట్టి నినాదాలు చేశారు. అవసరానికి తగినని ఎరువులు, యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

### యూరియా కొరతపై రైతుల ఆగ్రహం

కంప్లి, జూలై29(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం హడగలి సొసైటీ కేంద్రం వద్ద వివిధ ప్రాంతాల నుంచి చేరుకున్న రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రాథమిక గ్రామీణ వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి తాళం వేసి అధికారులను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత వారం నుంచి తాలుకాలో నిరంతరం వర్షాలు కురుస్తున్నాయని, మొక్కజొన్నతో సహా వివిధ పంటలు పెరుగుతున్న దశలో రైతులకు యూరియా ఎంతో అవసరం అని, అయినా అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. అధికారులు మాట్లాడుతూ యూరియా దిగుమతి లేకపోవడంతో కొరత ఏర్పడిందని, స్టాకు ఉన్నంత వరకే సరఫరా చేయగలమన్నారు.



హడగలి సొసైటి వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

### సక్రమంగా పంపిణీ చేయడం లేదు: మాజీ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎరువుల పంపిణీని సక్రమంగా చేపట్టడం లేదని, రూ. 8.73 లక్షల టన్నుల ఎరువులను సమర్థవంతంగా ఉపయోగించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ఆరోపించారు. సిరుగుప్ప పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం కేంద్రం పంపిణీ చేసిన రైతులను సక్రమంగా పంపిణీ చేసి ఉంటే ఈ సమస్య ఉండేది కాదన్నారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షుడు మల్లికార్జున స్వామి జిల్లా బీజేపీ యువమోర్చా అధ్యక్షులు సిద్దప్ప, రైతు నాయకులు శివకుమార్‌గౌడ పాల్గొన్నారు.

### ఎరువుల ధరలు తగ్గించాలి

కేంద్ర ప్రభుత్వం ఎరువుల రేట్లను తగ్గించాలని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని గాంధీజీ సర్కిల్‌లో వారు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా గోవింద మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒక పక్క పీఎం కిసాన్ నిధులు అందజేసి మరోవైపు రైతులపై ఎరువులు, విత్తనాల ధరలు పెంచడంపై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎద్దేవా చేశారు. తక్షణమే ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రైతులు కష్టాలు పడుతుంటే కాంగ్రెస్ నాయకులు పదవుల కోసం గొడవ పడుతున్నారన్నారు.



నాగ దేవతకు పూజలు చేస్తున్న అర్చకులు

### భక్తిశ్రద్ధలతో నాగపంచమి

- నాగులకట్ట వద్ద ప్రత్యేక పూజలు
- భక్తులతో ఆలయాలు కిటకిట

### మైనర్లకు బైకులిస్తే కఠిన చర్యలు

- తల్లిదండ్రులకు పోలీసుల హెచ్చరిక

### 2 నుంచి బెంగళూరు కవితా సమ్మేళనం


వివరాలు 7లో..


## మృతదేహాల ఆనవాళ్ల కోసం తవ్వకాలు

- సిట్ ఆధ్వర్యంలో ధర్మస్థళలో ప్రక్రియ

బెంగళూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళలో మృతదేహాలను పాతిపెట్టినట్లు ఫిర్యాదు చేసిన వ్యక్తి చూపించిన స్థలాలలో సిట్ అధికారులు మంగళవారం తవ్వకాలను ప్రారంభించారు. ఫిర్యాదుదారుడు సోమవారం చూపించిన 13 ప్రదేశాలను సిట్ అధికారులు మార్క్ చేశారు. బెళ్తంగడి పోలీసులు, వైద్య నిపుణులు, ఫోరెన్సిక్ నిపుణులు, సాయుధ బలగాల బందోబస్తుతో వెళ్లి మంగళవారం తవ్వకాలను ప్రారంభించారు. నేత్రావతి నది సమీపంలో గుర్తించిన ప్రదేశంలో తొలిరోజు తవ్వకాలు జరిపారు. నాలుగు అడుగుల లోతు తవ్వినా ఎటువంటి ఆనవాళ్లు కనిపించలేదు. మరోవైపు భారీ వర్షం కురుస్తుండటంతో కార్యాచరణకు అంతరాయం ఏర్పడింది. తవ్విన గుంతల్లో నీరు చేరడంతో మరింత లోతు తవ్వేందుకు సాధ్యం కాలేదు. వర్షపు నీటికితోడు నది పక్కనే తవ్వుతుండడంతో నీరు ఊరుతోంది. తవ్విన గుంతలను మరో రెండు అడుగుల లోతు తవ్వాలని సిట్ అధికారులు నిర్ణయించారు. మధ్యాహ్నం తర్వాత వర్షం కారణంగా సిబ్బందితో తవ్వకాలు సాధ్యం కాలేదు. ఆ తర్వాత యంత్రంతో 8 అడుగుల వెడల్పు 15 అడుగుల లోతు తవ్వకాలు జరిపినా మృతదేహాల ఆనవాళ్లు లభించలేదు. ఇప్పటివరకు 15 సమాధుల స్థలాలను గుర్తించారు. మరో 30-40 ప్రదేశాలను నిర్ధారించాల్సి ఉంది. ఫిర్యాదుదారుడికి పూర్తిగా ముసుగు వేసి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి తీసుకొచ్చారు.



పనిముట్లతో వచ్చిన సిబ్బంది

## విభజనతో ఖజానాకు చిక్కులే..!



- బీబీఎంపీని విభజిస్తే ఆర్థిక అసమానతలు తప్పవు
- ఆదాయ వనరుల క్రోడీకరణే పెనుసవాల్
- కొన్ని వార్డుల్లో గలగల.. మరికొన్నింటిలో వెలవెల
- అభివృద్ధికి సర్కారుపై ఆధారపడాల్సిందే..

బెంగళూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికె విస్తీర్ణం పెరుగుతోందని సమగ్రమైన పర్యవేక్షణ సాధ్యం కాదని భావించిన ప్రభుత్వం గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ)ని ఏర్పాటు చేసింది. బీబీఎంపీ పరిధిని 5 పాలికెలుగా విభజించారు. ఇప్పటిదాకా ఈ ప్రక్రియ బాగానే ఉన్నా సరిహద్దుల విషయంలో ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వార్డుల పరిధిలోకి రెండు శాసనసభ నియోజకవర్గాలను చేర్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇంకా ఈ ప్రక్రియ సాగుతోంది, అభ్యంతరాలు, సలహాలు ఇచ్చేందుకు మరో మూడు వారాకు పైగా గడువు ఉండడంతో సంబంధిత వార్డులనుంచి అభ్యంతరాలను వ్యక్తం చేసేలా ఎమ్మెల్యేలు సూచిస్తున్నారు. ఇది రాజకీయంగా వ్యతిరేకతకు కారణం అనిపించినా మరోవైపు పాలికెల మధ్య ఆర్థిక అసమానత నెలకొంటుందనే విమర్శలు ఎక్కువ అవుతున్నాయి.

### ఆర్థిక అసమానతే పెను సవాల్

బెంగళూరును ఐదు పాలికెలుగా విభజించారు. సరిహద్దుల అంశంలో ఎలా ఉన్నా ఆర్థిక అసమానత పాలికె భవిష్యత్తుకు పెను సవాల్ కానుంది. ప్రధానంగా ఐదు పాలికెల మధ్య భారీ వ్యత్యాసం కూడా ఉంటుంది. బెంగళూరు పశ్చిమలో 40లక్షలమంది జనాభా ఉండగా, బెంగళూరు తూర్పు పాలికెలో కేవలం 13లక్షలమంది మాత్రమే ఉన్నారు. బెంగళూరు తూర్పు జనాభాకు మూడింతలకంటే ఎక్కువగా ఉన్నారు. అయితే బెంగళూరు తూర్పు అంటే వైట్‌ఫీల్డ్, సర్జాపుర, మహదేవపుర, కేఆర్ పుర ప్రాంతాల్లోనే అత్యధిక ఐటీ బీటీ కంపెనీలు ఉన్నాయి. ప్రస్తుతం బెంగళూరులో అత్యధిక పన్నులు వసూలయ్యేది ఈ డివిజన్ పరిధిలోనే. బెంగళూరు పశ్చిమ సువిశాలం, జనాభా ఎక్కువగా ఉన్నా అందుకు తగినంత వనరులు కష్టతరం కానుంది. పాలికెల ప్రదేశ విస్తీర్ణం, సమతుల్యత చేసే కసరత్తు జరుపుతున్నారు. అయితే కార్పొరేషన్ ఏర్పాటుతో కొత్త పాలనా వ్యవస్థ అస్థిత్వానికి వస్తే ఆదాయం, ఆర్థిక వనరుల ద్వారానే అభివృద్ధి జరగనుంది. ఈ విషయంలో అధికారులు, నిపుణులతో కూడిన సమితి పూర్తిస్థాయిలో నిమగ్నం చేయలేదు. ఐదు పాలికెలను విభజించి కేంద్రీకరించిన పరిణామం భవిష్యత్తులో తలెత్తే ఆర్థిక సమస్యలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.

● ప్రస్తుతం బీబీఎంపీ పరిధిలో ఆదాయ మూలం ఆస్తి పన్నుగా ఉంది. 2024-25లో సుమారు రూ.5వేల కోట్ల పన్నులు చేశారు. పన్నుల వసూళ్ల వన్ టైం సెటిల్‌మెంట్ విధానంతో పాత బకాయిలకు వడ్డీ లేకుండా వసూలు చేశారు. ఇలా ఓటీఎస్ ద్వారా రూ.1100 కోట్ల రూపాయలు వచ్చింది. అయితే ఆస్తిపన్ను ద్వారా 4వేల కోట్ల రూపాయలు ఇంచుమించుగా ఉంటుంది. ప్రకటనల పన్నులు, కేబుల్, ఓఎఫ్‌సీ ట్యాక్స్ ఎఫ్ఆర్‌పేల నుంచి తలా వెయ్యి కోట్ల రూపాయలు వసూలవుతుంది. ఇలా 6వేల కోట్ల రూపాయలలో ఐదు పాలికెలకు పంచితే వెయ్యి కోట్లు మాత్రమే సాధ్యమవుతుంది. తూర్పు పాలికె పరిధిలో ఐటీబీటీ కంపెనీలు అధికంగా ఉన్నందున ఆస్తిపన్ను అదే స్థాయిలో ఉంటుంది. దక్షిణ పాలికెలో అపార్ట్‌మెంట్‌లు, సెంట్రల్ పాలికె పరిధిలో కమర్షియల్ ఆస్తులే ప్రధానం కానున్నాయి. ఉత్తర, పశ్చిమ డివిజన్ పరిధిలో తక్కువ పన్ను వసూలు కానుంది. ఆర్థిక కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

| పాలికె పేరు | విస్తీర్ణం | జనాభా |
|---|---|---|
| బెంగళూరు ఉత్తర | 158చ.కిమీ | 31 లక్షలు |
| బెంగళూరు దక్షిణ | 147 | 30 లక్షలు |
| బెంగళూరు తూర్పు | 168 | 13 లక్షలు |
| బెంగళూరు పశ్చిమ | 161 | 45 లక్షలు |
| బెంగళూరు సెంట్రల్ | 78 | 25 లక్షలు |

### సెంట్రల్ పాలికె విస్తీర్ణం పెంచాలి

కొత్తగా రూపొందించిన ఐదు పాలికెల్లో సెంట్రల్ పాలికె విస్తీర్ణం కేవలం 78 చదరపు కిలోమీటర్లు మాత్రమే ఉంది. మిగిలిన నాలుగు పాలికెల విస్తీర్ణం సెంట్రల్‌కు రెట్టింపుస్థాయిలో ఉంది. తద్వారా విస్తీర్ణం తక్కువగా ఉన్నందున ఆదాయ వనరులు కూడా తక్కువగానే ఉంటాయి. ప్రస్తుత బీబీఎంపీ పరిధిలో నగర వ్యాపార జిల్లా ప్రదేశాన్ని చేర్చేందుకు నిర్ణయించారు. ఇతర పాలికెలకంటే విస్తీర్ణం, పన్ను సేకరణలో పన్ను శాతం పెంచేందుకు దక్షిణ పాలికె పరిధిలోని బీటీఎం లే అవుట్‌ను సెంట్రల్ కార్పొరేషన్ పరిధికి చేర్చాలి. పశ్చిమ విభాగంలోని పద్మనాభనగరను దక్షిణవిభాగాలోకి చేరిస్తే కొంత సమానత తీసుకురావచ్చుననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని పాలికెలలో శాసనసభ నియోజకవర్గాల పరిధిలో రెండింటికీ విభజించారు. తద్వారా ఆదాయం కొరత ఎలా ఉన్నా ప్రజలు సమస్యలు, అభివృద్ధి విషయంలో ఇద్దరు ఎమ్మెల్యేలను ఆశ్రయించాల్సి ఉంటుంది. ఇటువంటి తప్పులను ప్రాథమిక దశలో నివారిస్తే సరిహద్దులతోపాటు విభజన తర్వాత వచ్చే పరిణామాలను దీర్ఘకాలంగా ఎదుర్కొనాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 5 పాలికెలకు ఏటా ఆస్తి పన్ను విషయంలో భారీ వ్యత్యాసం ఉంది. ఒకవేళ పట్టుదలతో ప్రభుత్వం ముందడుగు వేస్తే నగర పరిధిలో ఓ ప్రాంతం అత్యాధునికంగాను, మరో ప్రాంతం తీవ్రంగా వెనుకబడి పోయే ప్రమాదం ఉంది. ఐదు పాలికెల మధ్య ఆర్థిక అసమానత రానున్న కాలానికి పెను ప్రభావం చూపనుంది. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న బెంగళూరు పరిధిలో పాలికెల రూపంలో ఆర్థిక అసమానత ఏర్పడితే వెనుకబడిన ప్రాంతాల కోసం ప్రభుత్వం ఆర్థికంగా చేయూత ఇవ్వాల్సి ఉంటుంది. ఆర్థిక వనరుల క్రోడీకరణ పెను సవాల్ కానుంది.

| సంవత్సరం | పన్నుల వసూళ్లు |
|---|---|
| 2021-22 | రూ.3,033 కోట్లు |
| 2022-23 | రూ.3,758 |
| 2023-24 | రూ.3,920 |
| 2024-25 | రూ.4,930 |
| 2025-26 | రూ.6వేల కోట్లు అంచనా |

## క్రైం కార్నర్

### ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి

విడపనకల్లు, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని హావళిగి గ్రామానికి చెందిన రైతు మహేష్ గౌడ్ (65) చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. పాల్తూరు ఎస్ఐ మురహరిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహేష్‌గౌడ్ తనకున్న 2.5 ఎకరాల పొలంలో వివిధ రకాల పంటలు సాగు చేస్తుండేవాడు. పంటలు పండక పెట్టుబడులు కూడా గిట్టక అప్పులు రూ.6.5లక్షలకు పెరిగాయి. వాటిని ఎలా తీర్చాలో దిక్కుతోచక ఈనెల 15వ తేదీన సొంత వామి దొడ్డిలోకి వెళ్లి పురుగుల మందు తాగి, ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బళ్లారిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ 24వ తేదీ వరకూ చికిత్స పొందాడు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. రైతు భార్య హంపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రైతుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

### ట్రాక్టర్ బోల్తా.. కూలీ మృతి


వినోద్‌కుమార్ (ఫైల్)

తాడిపత్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు గ్రామ సమీపంలో ట్రాక్టర్ కిందపడి వినోద్‌కుమార్ (26) మృతి చెందినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. కూలి పనులు చేసుకుని జీవించే వినోద్‌కుమార్ రోజూ మాదిరిగానే మంగళవారం కూడా ట్రాక్టర్ పనులకు కూలికి వెళ్లాడు. మట్టి వేసుకొని వెళుతుండగా ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో కిందపడిన వినోద్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య శ్వేత, కుమారుడు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### పెళ్లయిన ఎనిమిది నెలలకే..
## మనస్పర్థలతో దంపతుల ఆత్మహత్య


మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ, ఎస్ఐ నబీరసూల్

బొమ్మనహాళ్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మనస్పర్థలతోనే నేమకల్లులో దంపతులు సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలను రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ నబీరసూల్ మంగళవారం వెల్లడించారు. వారు తెలిపిన మేరకు కర్ణాటక రాష్ట్రం హాస్పేట్ పట్టణానికి చెందిన రెహమాన్(25), హాస్పేట్ తాలూకా నాగేనహళ్లి గ్రామానికి చెందిన ఆఫ్రీనా(21) రెండేళ్ల కిందట ప్రేమించు కున్నారు. రెండు కుటుంబాల పెద్దలను ఒప్పించి, ఎనిమిది నెలల కిందట పెళ్లి చేసుకున్నారు. జీవనం కోసం నాలుగు నెలల కిందట నేమకల్లు గ్రామానికి వచ్చారు. అక్కడే ఆర్యవైశ్య కాంప్లెక్స్‌లో ఓ గదిని అద్దెకు తీసుకోని జీవించసాగారు. వీరితో పాటు ఆఫ్రీనా సోదరుడు శాబాషా కూడా ఉంటున్నాడు. కొద్ది రోజులుగా రెహమాన్ తాగుడుకు బానిసయ్యాడు. దీంతో దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. వారం కిందట ఆఫ్రీనా స్వగ్రామానికి సోదరుడితో కలిసి వెళ్లింది. సోమవారం తిరిగి నేమకల్లుకు వచ్చింది. భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో ఇద్దరూ ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాలకు బళ్లారి విమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

### దొంగతనం కేసు నిందితుడి అరెస్ట్

పెనుకొండ టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): పరిగి మండలంలో ఇటీవల పలు ఇళ్లలో చోరీకి పాల్పడి నగదు, బంగారం అపహరించిన నిందితుడు బోయరాజును అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పరిగి మండలం గొర్రెపల్లి క్రాస్ సమీపంలో బోయరాజును అరెస్ట్ చేసి అతడి నుంచి రూ.10లక్షలు విలువచేసే 13తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని రొద్దం మండలం శేషాపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇతను కర్ణాటకలో నివాసముంటూ అక్కడ కూడా పలు చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. కర్ణాటక ప్రాంతంలో ఇతడిపై 12కేసులున్నాయన్నారు. మరోవ్యక్తి చిన్నప్పరెడ్డి దొంగతనాలకు పాల్పడినవారిలో ఉన్నారని పుట్టపర్తిలో ఒక కేసులో జుడీషియల్ కస్టడీలో ఉన్నారని, అతన్నికూడా కస్టడీలో తీసుకుని విచారించి దొంగతనం చేసిన బంగారం రికవరీ చేస్తామన్నారు. వీరిని కోర్టులో హాజరు పరుచనున్నట్లు తెలిపారు.

### గొలుసు దొంగతనం కేసులో..

గుంతకల్లు టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూరు రోడ్డు, విజయనగర్ కాలనీ, గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లిలో మహిళల మెడలోని బంగారు గొలుసులను లాక్కున్న దుండగుడిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ మనోహర్ వెల్లడించారు. కంబదూరు మండలం వెంకటాంపల్లికి చెందిన ఎనుముల మారుతీప్రసాద్ స్కూటర్‌పై వచ్చి జూన్ 7వ తేదీ ఆలూరు రోడ్డులోని సాయిబాబా దేవాలయం వద్ద నివాసముంటున్న రాయల పుష్పవతి మెడలో బంగారు చైన్ లాక్కెళ్లాడు. ఈనెల 17న విజయనగర్‌కాలనీలో నివాసముంటున్న బోయ మల్లీశ్వరి మెడలోని, గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లిలో మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వన్‌టౌన్ సీఐ మనోహర్, సీసీఎస్ సీఐలు శేషగిరి, జైపాల్‌రెడ్డి, ఎస్ఐ వలిబాషా, వన్‌టౌన్ ఎస్ఐ కొండయ్యకు రాబడిన సమాచారం మేరకు కొనకొండ్ల రోడ్డులోని బీమా పార్క్ వద్ద అతడిని అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.7.50 లక్షల విలువచేసే 71 గ్రాముల బరువున్న మూడు బంగారు గొలుసులు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

#### పేకాటరాయుళ్ల అరెస్ట్

పట్టణంలోని హనుమేష్ నగర్, గుట్టల ఏరియాలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. వారి నుంచి రూ.10 వేలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

## రైతులను ముంచిన మిర్చి వ్యాపారి

బొమ్మనహాళ్, జూలై 29(ఆంధ్రజ్యోతి): తాము పండించిన పంటను కొనుగోలు చేసి, డబ్బులివ్వకుండా మోసం చేస్తున్నాడని ఓ వ్యాపారిపై మండలంలోని గోవిందవాడ గ్రామానికి చెందిన మిర్చి రైతులు పోలీసులను ఆశ్రయించారు. బాధితరైతులు తెలిపిన మేరకు మండలంలోని గోవిందవాడ, దేవగిరి గ్రామాల రైతులు నుంచి ప్రకాష్ అనే వ్యాపారి మిర్చి కొనుగోలు చేసి దాదాపు రూ. 2 కోట్లకు పైగా ఇవ్వకుండా మోసం చేస్తున్నట్లు బాధిత రైతులు సూరి రామచంద్ర, సుంకన్న, ఖలంధర్, గంగధర, వన్నూరుస్వామి, కూమారి, మనోహర్, లోకేష్, మారెన్న, రామంజి తదితరులు పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించినట్లు బాధితులు తెలిపారు. ఈ విషయంపై బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ వివరణ కోరగా గోవిందవాడ గ్రామానికి చెందిన ఖలందర్ అనే రైతు ప్రకాష్ అనే వ్యాపారికి రూ. 15 లక్షల విలువ చేసి మిర్చి పంటను ఇస్తే రూ. 2 లక్షలు మాత్రమే ఇచ్చాడు. మరో రూ. 13 లక్షలు రావాల్సి ఉందని ఫిర్యాదు చేశారు.


విలేకరులతో మాట్లాడుతున్న గోవిందవాడ రైతులు

# కూటమి ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్త బలి


విగత జీవిగా పడి ఉన్న భర్తను చూసి రోదిస్తున్న భార్య

కదిరి, జూలై 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ సర్పంచ్ చేసిన ఫిర్యాదు ఆధారంగా, దొంగతనం చేసినట్లు ఒప్పుకోవాలని పోలీసులు హింసించడంతో తలుపుల మండలం పులిగిండ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజనోళ్లపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త నవీన్(23) ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుమల తిరుపతి దేవస్థానంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న నవీన్, మూడు రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. బైక్‌పై వెళుతున్న సమయంలో గ్రామ సర్పంచ్, వైసీపీ నాయకురాలు సుగుణమ్మ ఇంటి బయట కనిపించడంతో పలకరించాడు. ఆ తరువాత ఏం జరిగిందోగాని, నవీన్‌ను అక్కడే నిలబెట్టి దొంగతనం నేరం అంటగట్టారు. తనపై దాడి చేసి, మెడలో ఉన్న చైన్‌ను లాక్కున్నాడని సుగుణమ్మ ఆరోపించారు. ఊరందరినీ అక్కడ పోగు చేశారు. తాను ఏ పాపం ఎరుగనని నవీన్ నెత్తీనోరు బాదుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. నవీన్‌పై ఫిర్యాదు రావడంతో ఎస్ఐ నరసింహుడు రంగంలోకి దిగారు. నవీన్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లి చితకబాదాడు. సుగుణమ్మపై దాడి చేసి, చైన్ లాక్కున్నట్లు ఒప్పుకోవాలని చిత్రహింసలు పెట్టాడు. తనకు జరిగిన అన్యాయం గురించి నవీన్ కుటుంబ సభ్యులకు చెప్పి కన్నీరు పెట్టుకున్నాడు. మరోసారి పోలీసులు పిలవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన నవీన్.. సెల్ఫీ వీడియోలో జరిగిందంతా చెప్పి.. ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామ సమీపంలోని చింతచెట్టుకు మంగళవారం ఉరి వేసుకున్నాడు.

### అవమాన భారంతోనే..

బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు, రాజనోళ్లపల్లికి చెందిన నవీన్ తిరుపతిలో సెక్యూరిటీ గార్డుగా టీటీడీలో పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నారు. వీరు స్వగ్రామంలోనే ఉంటారు. నవీన్ అప్పుడప్పుడు వచ్చి వెళుతుంటాడు. ఈ క్రమంలో మూడురోజుల క్రితం ఊరికి వచ్చాడు. అదే ఊరికి చెందిన పులిగిండ్లపల్లి సర్పంచ్ సుగుణమ్మను సోమవారం ఉదయం కొట్టి, ఆమె వద్ద ఉన్న ఆరు తులాల బంగారం చైన్‌ను లాకెళ్లపోయాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. సర్పంచ్ సుగుణమ్మ స్వయంగా సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వెంటనే పోలీసులు నవీన్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లారు. వైసీపీ నాయకుల ప్రోద్బలంతో నవీన్‌ను స్టేషన్‌లోనే ఎస్ఐ నరసింహుడు చితకబాదాడు. నేరం చేసినట్లు అంగీకరించాలని హింసించాడు. మరుసటి రోజు రావాలని చెప్పి పోలీసులు వదిలిపెట్టడంతో సోమవారం రాత్రి 9.30 గంటలకు నవీన్ ఇంటికి చేరుకున్నాడు. జరిగిన అవమానం గురించి రాత్రి 12.30వరకు కుటుంబ సభ్యులకు చెప్పి బాధపడ్డాడు. తనను పోలీసులు ఎలా కొట్టిందీ భార్య రూపకు చెప్పి, కన్నీరు పెట్టాడు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలని, ఆధార్ కార్డు తీసి ఉంచమని భార్యకు చెప్పి.. మంగళవారం ఉదయం బయటకు వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు, బంధువులు గాలించారు. గ్రామ సమీపంలోని ఓ చింత చెట్టుకు నవీన్ ఉరి వేసుకుని కనిపించాడు. కిందకు దించి చూసి.. అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. మృతదేహాన్ని తీసుకుని తలుపుల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. అనంతరం స్వగ్రామం రాజనోళ్లపల్లికి మృతదేహాన్ని తీసుకువెళ్లి సర్పంచ్ సుగుణమ్మ ఇంటిముందు బైఠాయించారు. పోలీసులు అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. కేసు నమోదు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నవీన్ భార్య ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేశామని రూరల్ సీఐ నాగేంద్ర తెలిపారు. సర్పంచ్ సుగుణమ్మ, ఆమె బంధువులు, కుటుంబ సభ్యులు రాజనాల సుబ్బారెడ్డి, రఘునాథరెడ్డి (తలుపుల సాక్షి విలేకరి), వాసుదేవరెడ్డి, గంగులమ్మ, చందు, విశ్వనాథరెడ్డిపై 306 సెక్షన్ కింద కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితులలో ఇద్దరు తమ అదుపులో ఉన్నారని, మిగిలినవారి కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

### దగ్గరుండి కొట్టించారు..

నవీన్‌ను తలుపుల స్టేషన్‌కు తీసుకువెళ్లిన తరువాత నేరం ఒప్పుకోవాలని ఎస్ఐ నరసింహుడు చితకబాదాడని బంధువులు వాపోయారు. జరిగిన సంఘటన గురించి సీఐ నాగేంద్రకు వివరించారు. వైసీపీకి చెందిన పలువురు నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఉండి, ఎస్ఐని రెచ్చగొట్టి మరీ కొట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాళ్ల, చేతులు కట్టేసి కొట్టారని నవీన్ ఆ రాత్రి కన్నీరు పెట్టుకున్నాడని, జరిగిన అవమానాన్ని తలచుకుని కుమిలిపోయాడని అన్నారు. గొలుసు పోయిందని చెప్పినప్పుడు తాము సర్పంచ్ ఇంటి వద్దే ఉన్నామని, తన భర్తను, బైకును అందరూ తనిఖీ చేసినా చైన్ దొరకలేదని రూప కన్నీరుమున్నీరయ్యారు. బైకు అక్కడే ఉంచాలని సర్పంచ్ బంధువులు చెప్పడంతో అక్కడే పెట్టి వెళ్లిపోయామని, ఆ తరువాత పోలీసులు వచ్చి తమ బైకును తనిఖీ చేయగానే చైన్ బయటపడిందని అన్నారు. ఇలా ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పోలీసులు తన భర్తను తీవ్రంగా కొట్టి అవమానించారని బోరున విలపించారు. విషయం తెలియగానే వడ్డెర సంఘం నాయకులు కదిరి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్దకు చేరుకుని బైఠాయించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### వైసీపీవారే హత్య చేశారు: రూప

తన భర్త నవీన్‌ను వైసీపీకి చెందిన సర్పంచ్ సుగుణమ్మ, ఆమె బంధువులు హత్య చేశారని రూప పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్తపై దొంగతనం కేసు మోపారని, ఎస్ఐ చేత చితకబాదించారని పేర్కొన్నారు. సర్పంచ్ సుగుణమ్మ బంధువులు సోమవారం రాత్రి తమ ఇంటివద్దకు వచ్చి, తన భర్తను చంపేస్తామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని, సర్పంచ్ బంధువులే హత్య చేశారని ఫిర్యాదు చేశారు. తనకు ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నాడని, తమ భవిష్యత్తు ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్తను కొట్టిన ఎస్ఐపైన, హత్య చేసిన సర్పంచ్, ఆమె బంధువులపైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

### రాజకీయాలే కారణమా..?

నవీన్ ఆత్మహత్యకు రాజకీయాలే కారణమని అతని బంధువులు చెబుతున్నారు. గత ఎన్నికలలో టీడీపీ మద్దతుతో నవీన్ తల్లి ప్రమీల సర్పంచ్‌గా పోటీ చేశారు. నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలని చివరి నిమిషం వరకు ప్రమీలపై సుగుణమ్మ బంధువులు ఒత్తిడి తెచ్చారు. అయినా ఆమె పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. అప్పటి నుంచి ప్రమీల కుటుంబంపై సుగుణమ్మ కుటుంబం కక్ష పెంచుకుందని అంటున్నారు. కూటమి ప్రభుత్వంలో కూడా టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు రక్షణ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.


నిరసన వ్యక్తం చేస్తున్న బాధితురాలు

### ఉసురు తీసిన పలకరింపు



ముక్కుపచ్చలారని పిల్లోడు. నిండా పాతికేళ్లు లేవు. భార్య, ఏడాదిన్నర వయసున్న కొడుకును విడిచి, పొట్ట చేతబట్టుకుని ఊరికి దూరంగా వెళ్లిపోయాడు. జ్వరం వస్తోందని సొంతూరుకు వచ్చాడు. పనిమీద వేరే ఊరికి వెళుతూ.. అరుగుమీద కనిపించిన సర్పంచ్‌ను పలకరించాడు. ఎన్నికల్లో తన తల్లిని ఓడించిన రాజకీయ ప్రత్యర్థి అయినా, పల్లెటూరి పిల్లోడు అవేమీ పట్టించుకోలేదు. కళ్లెదుటే పెద్దామె కనిపిస్తే.. 'అమ్మా ఎలా ఉన్నారు..?' అని పలకరించకుండా ఉంటారా ఎవరైనా..! అదే చేశాడు. 'అలా పలకరించేందుకు బండి ఆపడమే నేరమైంది. లేకుంటే ఏ రామాయణమూ ఉండేది కాదు..' అని కన్నీరు పెట్టుకున్నాడు. ఇంత జరిగాక తన గురించి ఎవరేమి అనుకుంటారో..? తాను నిర్దోషినని నమ్ముతారా..? లేక అనుమానంగా చూస్తారా..? ఇకపై తన భవిష్యత్తు ఏమిటి..? అని మనోవేదనకు లోనయ్యాడు. అవమాన భారంతో ఉరితాడుకు వేలాడాడు.

### చివరి సందేశం సోదరికి..

"అరుణక్కా... నీకే చెబుతున్నా! వీళ్లు ఎవరూ నేను చెప్పింది వింటారో లేదో తెలియదు. నిన్న ఏమి జరిగిందో ఏమో నాకు తెలియదు. నేను ఓబుళరెడ్డిపల్లికి పోదామని బయలుదేరాను. నరసింహారెడ్డి ఇంటివద్ద సుగుణమ్మ కనిపించింది. బండి ఆపి పలకరించాను. ఆమె ముఖం చూస్తే ఎవరో కొట్టినట్లు కనిపించింది. నేను పోతావుంటే ఆమె 'ఈశ్వర్ రెడ్డీ వీడే నన్ను కొట్టాడు. నా చైన్ లాక్కున్నాడు' అనింది. అందరినీ పిలిచింది. వారెవరూ నా మాట ఏవరూ వినలేదు. నేను చైన్ తీసుకుంటే పారిపోకుండా అక్కడే ఎందుకు ఉంటాను..? 'వాడు తెలిసో తెలియక చేసినాడేమో.. సుగుణమ్మ కాళ్లమీద పడితే క్షమిస్తుంది..' అన్నారు. నన్ను, బండిని చెక్ చేసినా ఏమీ దొరకలేదు. 'బైకు ఇక్కడే పెట్టి నువ్వు ఇంటికి పో పై..' అన్నారు. ఇక్కడే ఉంటాను. వెళ్లిపోతే నింద మోయాల్సి వస్తుందని అన్నా వినిపించుకోలేదు. బైకు అక్కడే పెట్టి నేను ఇంటికి వెళ్లిపోయాను. ఆ తరువాత నా బైకులో చైన్ దొరికిందని అన్నారు. తలుపుల స్టేషన్‌కు పిలుచుకునిపోయారు. ఏమి జరిగిందని ఎవరూ అడగలేదు. ఎస్ఐ నన్ను పక్కకు పిలిచి, చేతులు, కాళ్లు కట్టేసి కొట్టినాడు. దొంగతనం ఒప్పుకోమని అన్నాడు. చేసినా చేయకపోయినా ఒప్పుకోవాల్సిందే అన్నాడు. ఒప్పుకోకుంటే మీ నాన్నను తీసుకొచ్చి ఇట్లే కొడతామని బెదిరించాడు. మీనాన్న చంపేస్తారు వాళ్లు అన్నాడు. దెబ్బలు తట్టుకోలేక చివరకు ఒప్పుకున్నాను. బండి అడ ఆపకపోతే నాకు ఈ రామయణమే ఉండేది కాదు.." అని కన్నీటితో వివరించాడు. ఈ సెల్ఫీ వీడియోను వరుసకు తన సోదరి అయ్యే అరుణకు పంపించాడు. ఆ తరువాత ఆత్మహత్య చేసుకున్నాడు.

## బెస్ట్ పీఎంశ్రీ పాఠశాల ప్రారంభం


వర్చువల్ విధానంలో పాల్గొన్న డీఈఓ

గుత్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ బాలికల గురుకుల పాఠశాల బెస్ట్ పీఎంశ్రీ స్కూల్‌గా ఎంపికైయింది. కేంద్ర మంత్రిధర్మేంద్ర ప్రధాన్ ఢిల్లీలో వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ ప్రసాద్‌బాబు హాజరయ్యారు. విద్యావిధానాన్ని అభివృద్ధి పరిచేందుకు ఈ విధానాన్ని ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలోని గుత్తి ఏపీ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాల ఎంపికకావడం హర్షనీయం అని డీఈఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 మనోహర్, ప్రిన్సిపాల్ విజయలత, ఏఈ నరేంద్ర, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### గరీబ్ రథ్‌కు అదనపు కోచ్

గుంతకల్లు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): యశ్వంతపూర్-పూరీ వెళ్లే గరీబ్ రథ్ (22883/84) రైలుకు అదనంగా ఓ ఏసీ త్రీటైర్ కోచ్‌ను జత చేయనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు రెండు నుంచి ఈ అప్ అండ్ డౌన్ రైళ్లకు ఈ అదనపు బోగీను జత చేస్తామన్నారు. ఇప్పటి వరకూ 17 కోచ్‌లతో వెళ్లే ఈ రైలు ఇకపై 18 కోచ్‌లతో నడుస్తుందన్నారు.

### రేపు జాబ్‌మేళా

అనంతపురం రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఈనెల 31న ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఆ మేరకు మంగళవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. శ్రీరామ్‌లైఫ్ ఇన్సూరెన్స్, స్విగ్గీ, హిటాచీ క్యాష్ మేనేజమెంట్ సర్వీస్, సంగీత మొబైల్స్, కియ ఇండియా, కీర్తి మెడికల్ స్టోర్స్ వంటి 13 కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులు అర్హులన్నారు. ఉదయం 9:30గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభం అవుతుందన్నారు. వివరాలకు 8317520929 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### కట్టుదిట్టంగా సెక్టోరల్స్ దరఖాస్తుల పరిశీలన

అనంతపురం విద్య, జూలై29(ఆంధ్రజ్యోతి): సెక్టోరల్స్ నియామకాల ప్రక్రియ సమగ్రశిక్ష అధికారులకు కత్తిమీదసాములా తయారైంది. ఇప్పటికే ఓసారి నోటిఫికేషన్ ఇచ్చి ఎంపిక చేయగా.. వివిధ ఆరోపణలు రావడంతో పూర్తిస్థాయిలో సెక్టోరల్స్‌ను నియమించలేకపోయారు. మరోసారి సెక్టోరల్స్ నియామకాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఈసారి ఏపీసీ శైలజ ఆధ్వర్యంలో ప్రక్రియ ఎలా చేపడతారోనని టీచర్లు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఆరు సెక్టోరల్ పోస్టులకు 171 దరఖాస్తులు రాగా.. పరిశీలన ప్రక్రియ అత్యంత గుట్టుగా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కమిటీతో చేయిస్తున్నారు. మూడురోజులుగా సాగుతున్న ఈ పరిశీలన మంగళవారానికి దాదాపు పూర్తయిందని తెలుస్తోంది. పరిశీలన ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని ఏపీసీ చెబుతున్నారు. దీంతో ఉపాధ్యాయ వర్గాలలో ఉత్కంఠ నెలకొంది.

### చీనీ టన్ను రూ.16వేలు

అనంతపురం రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్టంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయని వివరించారు.

## ప్రత్యామ్నాయ పంటలకు సిద్ధం కావాలి

● ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్ బాబు

బుక్కరాయసముద్రం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడానికి ఉమ్మడి జిల్లా రైతులు సిద్ధం కావాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు తెలిపారు. రానున్న రోజుల్లో వర్ష సూచన లేకపోవడంతో వర్షాధార ఎర్ర నేలల్లో జొన్న, కొర్ర, కంది పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. నల్లరేగడి నేలల్లో కంది, ఆముదం, పత్తి పంటలు ఆగస్టు మొదటి వారం వరకు విత్తుకోవచ్చని తెలిపారు. జూన్‌లో వర్షాధారంగా వేసిన వేరుశనగ, కంది, ఆముదం పంటలు బెట్టకు గురికావడం గమనించామన్నారు. దీనిని అధిగమించడానికి రైతులు 19:19:19 నీటిలో కరిగే ఎరువును 10 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. నీటి పారుదల కింద సాగుచేసిన వేరుశనగ పూత దశలో ఉందన్నారు. రైతులు ఎకరాకు 200 కిలోల జిప్సం పూత దశలో వేయాలన్నారు. ప్రస్తుతం విత్తిన వేరుశనగ పంటను కుళ్లు, రసం పీల్చే పురుగులు ఆశించే అవకాశం ఉందన్నారు. కుళ్లు నివారణకు కార్బండిజం, మాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదలు బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. రసం పీల్చే పరుగు నివారణకు ఇమిడక్లోప్రిడ్ 0.5 మి.లీ., లీటరు నీటికి కలిపి స్థానిక వాతావరణ పరిస్థితుల మేరకు పిచికారీ చేసుకోవాలన్నారు. కంది పంట విత్తిన 20-30 రోజులకు గొర్ర, గుంటకలతో అంతరకృషి ద్వారా కలుపు నివారణ చేయాలన్నారు.

### వచ్చే ఐదు రోజులు వానలు లేవు

రానున్న ఐదు రోజుల్లో వర్షసూచన లేదని వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణ స్వామి తెలిపారు. అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 33.8 నుంచి 35.2 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24.2 నుంచి 24.8 డిగ్రీల సెల్సియస్ నమోదవుతాయన్నారు. పశ్చిమ దిశగా గాలులు గంటకు 15 నుంచి 16 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. గాలిలో తేమ ఉదయం 62-65 శాతం, రాత్రి సమయాల్లో 42-48 శాతం ఉంటుందన్నారు.

## వ్యాలీగ్రీన్ గార్మెంట్స్ పరిశీలన


వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పామిడి, జూలై 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గజరాంపల్లి గ్రామంలోని వ్యాలీగ్రీన్ గార్మెంట్స్ ఇండస్ట్రీని జిల్లా పరిశ్రమల కేంద్రశాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. పరిశ్రమ అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, మహిళల శిక్షణపై టీడీపీ నాయకుడు, వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్ అధినేత పెరుమాళ్ల జీవానందరెడ్డితో సమీక్షించారు. ఇప్పటి వరకూ నాలుగు వేల మంది మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చామని, శిక్షణా సమయంలో రూ.5వేలు స్టైఫండ్ ఇవ్వడంతో పాటు ఉచిత బస్సు, భోజన వసతులు కల్పించామని, వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పించామని జీవానందరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమలశాఖ జీఎం సీ శ్రీనివాస్ యాదవ్, అసిస్టెంట్ డైరెక్టర్ కే రాజశేఖర్ రెడ్డి, ఐపీఓ భువనేశ్వరి పాల్గొన్నారు.

## విధుల్లో చేరిన రామగిరి సీఐ


సీఐ శ్రీధర్

చెన్నేకొత్తపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): రామగిరి సీఐ శ్రీధర్ తిరిగి విధుల్లో చేరారు. ఆయన గతనెల 27వతేదీ నుంచి సెలవుపై వెళ్లిన విషయం తెలిసిందే. నెల రోజుల తరువాత మంగళవారం తిరిగి విధులకు హాజరయ్యారు. అప్పట్లో ఉన్నఫలంగా సెలవులో వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత కారణాలతోనా? రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో వెళ్లారా అన్న చర్చ సాగింది. పాపిరెడ్డిపల్లిలో వైసీపీ కార్యకర్త లింగమయ్య హత్య, జగన్ పర్యటనలో కుంటిమద్ది హెలీకాప్టర్ వద్ద చోటు చేసుకున్న పరిణామాలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. దీనికి తోడు రామగిరి మండలంలో బాలికపై అత్యాచార ఘటన కూడా రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనల నేపథ్యంలో తీవ్ర ఒత్తిళ్లతోనే సీఐ సెలవుపై వెళ్లారన్న చర్చ సాగింది. సీఐ తిరిగి ఇక్కడ విధుల్లో చేరతారా, లేదా అన్న సందేహాలు కూడా తలెత్తాయి. ఈ క్రమంలో ఆయన విధుల్లో చేరడంతో ఊహాగానాలకు తెరపడినట్లయింది. హెలీప్యాడ్ ఘటన, చలో పేరూరు కేసులో విచారణకు సంబంధించి ప్రస్తుతం స్తబ్దత నెలకొంది. సీఐ రావడంతో విచారణ వేగం పుంజుకుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, వ్యక్తిగత కారణాలతోనే సెలవుపై వెళ్లానని సీఐ శ్రీధర్ పేర్కొన్నారు.

## బాలుడికి దంతాలు

● మెగా పీటీఎం 2.0లో సీఎంను కలిసిన ఫలితం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


విద్యార్థి బాలు

కొత్తచెరువు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జన్యులోపంతో ఇబ్బంది పడుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థి బాలుకు మంచి రోజులు వస్తున్నాయి. కొత్తచెరువు బీసీ కాలనీలో ఉంటున్న మాధవి, నరసింహ దంపతుల కుమారుడు బాలు. కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో ఈ నెల 10న జరిగిన మెగా పీటీఎం 2.0లో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మాధవి, ఆమె నలుగురు పిల్లలు కలిసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో బాలు ఆరోగ్యం గురించి సీఎం చంద్రబాబు ఆరా తీశారు. జన్యులోపంతో బాధపడుతున్నట్లు తెలుసుకుని, వైద్యం చేయిస్తామని హామీ ఇచ్చారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడటంతో హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ నామినేని స్పందించారు. బాలుకు ఉచితంగా వైద్యం చేస్తామని ప్రకటించారు. దీంతో ఈ నెల 26న మాధవి, నరసింహ దంపతులు తమ కుమారుడు బాలును తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ ఆంధ్రజ్యోతి యాజమాన్యం సహకారంతో బాలును ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. బాలుకు పుట్టిన తరువాత రెండు దంతాలు మాత్రమే వచ్చాయి. జన్యు లోపం కారణంగా మిగిలిన దంతాలు రాకపోవడంతో సరైన ఆహారం తీసుకోలేకపోతున్నాడు. నమిలి తినాల్సిన పండ్లు, కూరగాయలు, ఇతర ఘన పదార్థాలకూ దూరమయ్యాడు. దీంతో అతనిలో ఎదుగుదలకు సంబంధించిన సమస్యలు తలెత్తాయి. బాలును పరీక్షించిన వైద్యులు.. కృత్రిమ దంతాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికోసం కొలతలు తీసుకున్నారు. ఆగస్టు 4న తమ కుమారుడిని ఆస్పత్రికి తిరిగి తీసుకురమ్మన్నారని బాలు తల్లిదండ్రులు తెలిపారు. దంతాలు ఏర్పాటు చేస్తే తనకు ఇష్టమైన అన్ని పదార్థాలను తింటానని బాలు సంబరంగా అంటున్నాడు. ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, డాక్టర్ శ్రీనివాస్ నామినేనికి బాలు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## మార్గదర్శకుల గుర్తింపుపై దృష్టి

: ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, జూలై 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీ-4 కార్యక్రమం కింద మార్గదర్శకుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జీరో పావర్టీ పీ-4 కార్యక్రమం, పింఛన్ల పంపిణీ, బీఎస్‌డబ్ల్యూఎస్ తదితర అంశాలపై ఆయా శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు తదితరులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ పీ4 కార్యక్రమంలో మార్గదర్శకులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వచ్ఛందంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు 18వేలకు పైగా బంగారు కుటుంబాలను దత్తత ఇచ్చినట్లు వెల్లడించారు. వివిధ శాఖల అధికారులు అవగాహన కల్పించి మార్గదర్శకులను గుర్తించాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఆగస్టు 1న పింఛన్ల పంపిణీ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, సీపీఓ అశోక్‌కుమార్, డీపీఓ నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ శివశంకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డీఆర్డీఏ పీడీ శైలజ, మైన్స్ డీడీ ఆదినారాయణ, డ్వామా పీడీ సలీమ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

## రా వి శాస్త్రి (జయంతి)



ప్రముఖ రచయిత రా వి శాస్త్రిగా పేరొందిన రాచకొండ విశ్వనాథ శాస్త్రి 1922 జూలై 30న శ్రీకాకుళంలో జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయినా రచయితగా పేరొందారు. 'అల్పజీవి' నవల ఉత్తమంగా నిలిచింది. రాచకొండ కథలు, కథా సాగరం, బంగారం, రాజు మహిషీ, రత్తాలు-రాంబాబు, ఇల్లు తదితర నవలలు పేరొందాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల మాండలికంలో అట్టడుగు వర్గాల ప్రజల సమస్యలపై చేసిన రచనలు ఆకట్టుకున్నాయి. నిజం, కన్యాశుల్కం నాటికలలో నటించారు. ఆంధ్ర యూనివర్సిటీ 'కళాప్రపూర్ణ' పురస్కారం ప్రకటించగా సున్నితంగా తిరస్కరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని వాపసు చేశారు. 'విరసం' సంస్థాపకులలో ఒకరు. 1993 నవంబరు 10న కన్నుమూశారు.

## పులికంటి కృష్ణారెడ్డి (జయంతి)



రాయలసీమ చిన్నోడిగా పేరొందిన సాహితీవేత్త పులికంటి కృష్ణారెడ్డి 1931 జూలై 30న చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం జక్కదోన గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించారు. నాలుగ్గాళ్ళ మండపం పుస్తకం మరో ప్రత్యేకత. రాయలసీమ ప్రజల కష్టాలను తన కథల్లో సహజంగా చిత్రించిన అరుదైన కథకుడు. 13 ఏళ్లు రైల్వేశాఖలో పనిచేసి కేవలం సాహిత్యం, కళలకోసం ఉద్యోగం వదులుకున్నారు. 200 కథలు, 60 కవితలు, 5 దృశ్య నాటికలు, 43 అమ్మిపదాలు రాశారు. గూడుకోసం గువ్వలు, పులికంటి కథలు, కోటిగాడు స్వతంత్రుడయ్యాడు వంటి గ్రంథాలు వెలువరించారు. 'కామదేను' పక్షపత్రికను ఆరేళ్లు నడిపారు. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో ఆడిషన్ కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు. చిత్తూరు జిల్లా రచయితల సంఘానికి ఉపాధ్యక్షులుగా సుదీర్ఘకాలం పనిచేశారు. 2007 నవంబరు 19న కన్నుమూయడంతో రాయలసీమ మాండలికం మూగబోయింది.

## దేవదాస్ కనకాల (జయంతి)



దేవదాస్ కనకాల 1945 జూలై 30న యానాంలో జన్మించారు. తెలుగులో పేరొందిన నటుడు, దర్శకుడు, నట శిక్షకుడు. పూనె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన తొలితరం తెలుగు నటులలో ఒకరు. చలిచీమలు సినిమాకు దర్శకత్వం వహించారు. అడయార్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్, మధు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఫ్యాకల్టీగా, తెలుగు యూనివర్శిటీలో థియేటర్ ఆర్ట్ డెవలప్‌మెంట్‌కు విభాగాధిపతిగా కొనసాగారు. వెండితెరపైనా, బుల్లితెరపైనా, నాటక రంగంలోనూ ఎంతోమంది నటులకు శిక్షణ ఇచ్చారు. రజనీకాంత్, చిరంజీవి, రాజేంద్రప్రసాద్ వంటివారు ఆయనవద్ద శిక్షణ పొందినవారే. ఓ సీతకథ, గ్యాంగ్‌లీడర్, మంచు పల్లకి, మనసంతా నువ్వే, జోష్ తదితర సినిమాల్లో నటించారు. 2019 ఆగస్టు 2న కన్నుమూశారు. కాగా ఆయన కుమారుడు రాజీవ్ కనకాల కూడా నటుడిగా పేరొందారు.

## జీన్ ప్యాట్రిక్ మొడియానో (పుట్టినరోజు)



జీన్ ప్యాట్రిక్ మొడియానో 1945 జూలై 30న జన్మించారు. ఫ్రాన్స్ దేశంలో ప్రముఖ రచయితలలో ఒకరైన ఆయన 2014లో సాహితీ రంగంలో నోబెల్ ప్రైజ్ అందుకున్నారు. 2012లో ఆస్ట్రియన్ స్టేట్ ప్రైజ్ ఫర్ యూరోపియన్ లిటరేచర్, నేషనల్ లిటరేచర్ గ్రాండ్ ప్రైజ్ ఇతర అవార్డులు అందుకున్నారు. పిల్లల పుస్తకాలు కూడా రాశారు. ఆయన రచనలు 30 భాషలలోకి తర్జుమా కావడం విశేషం. స్క్రీన్ రైటర్‌గానే కాక బుల్లితెర, వెండితెరపై నటుడిగా కూడా గుర్తింపు పొందారు.

## అర్నాల్డ్ స్వార్జ్‌నెగర్ (పుట్టినరోజు)



అర్నాల్డ్ అలోయిస్ స్వార్జ్‌నెగర్ 1947 జూలై 30న జన్మించారు. ఆస్ట్రియన్ - అమెరికన్ నటుడు, నిర్మాత, వ్యాపారవేత్త, రిటైర్డ్ బాడీబిల్డర్, మాజీ రాజకీయవేత్త. 2003 నుంచి 2011 వరకు కాలిఫోర్నియా 38వ గవర్నర్‌గా వ్యవహరించారు. వెయిట్ లిఫ్టర్‌గా కెరీర్ ప్రారంభించి 'మిస్టర్ ఒలింపియా'లో సత్తా చాటుకున్నారు. ప్రెసిడెంట్స్ కౌన్సిల్ ఆన్ ఫిజికల్ ఫిట్‌నెస్ అండ్ స్పోర్ట్స్‌కు 1990 నుంచి 1993 వరకు ఛైర్మన్‌గా వ్యవహరించారు. అనంతరం హాలీవుడ్ యాక్షన్ ఫిల్మ్‌స్టార్‌గా ఎదిగారు. 'టర్మినేటర్' సిరీస్, కమాండో, ట్రూ లైస్, ప్రిడేటర్ వంటి సినిమాలతో ఎంతో పేరొందారు. 'ఓక్ ప్రొడక్షన్స్' సంస్థాపకులు.

## సోనూ నిగమ్ (పుట్టినరోజు)



ప్రముఖ గాయకుడు 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత సోనూ నిగమ్ 1973 జూలై 30న హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్‌లో జన్మించారు. మోడ్రన్ రఫీగా అభిమానులు పిలుస్తారు. జాతీయ స్థాయిలో గాయకుడిగా, సంగీత దర్శకుడు, నటుడు, వ్యాఖ్యాతగా రాణించారు. హిందీ సినిమాల్లో ఎక్కువ పాటలు పాడారు. బెంగాలీ, కన్నడ, తెలుగు, తమిళం, మరాఠీ, ఒరియా, గుజరాతీ, అస్సామీ, తుళు, మైథిలీ, నేపాలీ, పంజాబీ తదితర భాషల్లోనూ పాటలు పాడారు. భక్తిగీతాలతోపాటు దేశవాళీ పాప్‌ఆల్బమ్స్ విడుదల చేశారు. భారతీయ గాయకులలో అత్యధిక పారితోషికం అందుకునే వారిలో ఒకరు. దేశ విదేశాలలో ప్రదర్శనలు ఇచ్చారు. ఒక జాతీయ, రెండు ఫిల్మ్‌ఫేర్, ఇండియన్ టెలివిజన్ అకాడమీ అవార్డ్స్ తదితర అవార్డులు పొందారు.

## చిరుత దాడిలో మేకల మృతి

ముళబాగిలు, జూలై 29(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కురుడుమలె కొండపై నారాయణస్వామి మేకలను మేపుతున్న వేళ అకస్మాత్తుగా రెండు చిరుతలు దాడి చేశాయి. దీంతో భయపడిన నారాయణస్వామి కేకలు వేస్తూ ఎలాగో అలా తప్పించుకుని కిందకు వచ్చాడు. ఈలోగా 11మేకలను చిరుతలు దాడి చేసి చంపాయి. మిగిలిన మేకలు చెల్లాచెదురుగా వెళ్లాయి. చిరుత దాడితో నారాయణ స్వామికి తీవ్ర నష్టం వాటిల్లింది.

# భక్తిశ్రద్ధలతో నాగపంచమి



మల్లేశ్వరంలో నాగదేవతలకు పూజలు



ముక్తినాగ ఆలయంలో భక్తులు

బెంగళూరు, జూలై29(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలో పండుగలు వచ్చేశాయి. నాగపంచమి పండుగను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఉత్సాహంగా జరుపుకొన్నారు. అశ్వత్థకట్ట సహా పుట్టలకు పూజలు చేశారు. ప్రతిచోటా ఉదయం నుంచే పూజలు కొనసాగాయి. ప్రత్యేకించి సుబ్రమణ్యస్వామి ఆలయాలలోనూ, ఇతర ఆలయాలోనూ విశేషపూజలు నిర్వహించారు.

**బాగేపల్లిలో...**

బాగేపల్లి: నాగపంచమిని పురస్కరించుకుని పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా మంగళవారం విశేషంగా పూజలు సాగాయి. నాగదేవతలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దంపతులు పిల్లలతో కలసి పుట్టలో పాలు పోసి పూజలు జరిపారు. దేవాలయం, అశ్వత్థకట్ట, రావిచెట్టు, నాగదేవతలకు పూజలు చేశారు. పట్టణంలోని నేషనల్ కళాశాల సమీపానగల పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

**విజయపురలో..**

విజయపుర: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని సోమేశ్వర దేవాలయం సమీపానగల అశ్వత్థకట్టపై గల నాగదేవతలకు మంగళవారం విశేషపూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**చింతామణిలో...**

చింతామణి: చింతామణి పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా నాగపంచమిని పురస్కరించుకుని విశేషపూజలు సాగాయి. ముత్తైదువులు, యువతులు పిల్లలు నాగదేవతలకు పూజలు చేశారు.



విజయపురలో నాగదేవతలకు పూజలు



బాగేపల్లిలో పాలు పోస్తున్న మహిళ



చింతామణిలో..

# శ్వాసకోశ సమస్యలను నిర్లక్ష్యం చేయరాదు

**» గ్లోబల్ సదస్సులో పల్మనాలజిస్టులు**




సదస్సులో పాల్గొన్న పల్మనాలజిస్టులు

బెంగళూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): శ్వాసకోశ సమస్యలపై నిర్లక్ష్యం చేయరాదని ప్రపంచ స్థాయి సదస్సులో పల్మనాలజిస్టులు అభిప్రాయపడ్డారు. ఏసియా పసిఫిక్ ఇంటర్‌వెన్షనల్ పల్మనరీ అలయెన్స్ సహకారంతో శ్వాస స్లీప్ స్పెషాలిటీ సెంటర్ వ్యవస్థాపకులు డాక్టర్ రవీంద్ర మెహతా ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. నగరంలో ఏర్పాటైన సదస్సుకు దేశవ్యాప్తంగా ప్రముఖ పల్మనాలజిస్టులు భాగస్వామ్యులయ్యారు. పలువురు విదేశీ నిపుణులు వర్చువల్ రూపంలో భాగస్వామ్యులయ్యారు. వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ బ్రాంకాలజీ, అండ్ ఇంటర్‌వెన్షనల్ పల్మ నాలజీ, యూరోపియన్ అసోసియేషన్ ఆఫ్ బ్రాంకాలజీ అండ్ ఇంటరెవెన్షనల్ పల్మనాలజీ, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ బ్రాంకాలజీ, కర్నా టక పల్మనరీ అసోసియేషన్‌తోపాటు రోహిణి, నందన్‌నీలేకనిల సహకారంతో సదస్సు జరిగింది. ప్రగతిపర ఆరోగ్యరంగంలో శ్వాసకోశ సమస్యలకు ఆధునాతన చికిత్సలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. వర్చువల్ రూపంలో పాల్గొన్న వారు రెండు నిమిషాల వీడియోలను ప్రదర్శించారు. గ్లోబల్ ఫ్యాకల్టీ ప్రామాణికత, క్లినికల్ పరీక్షలకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. మేక్ ఇట్ ఇండియా సాంకేతిక సురక్షత అంశాలను డాక్టర్ రవీంద్ర మెహతా వివరించారు. నగరంలో జరిగిన సదస్సు విజయవంతమైందన్నారు.

## 'సేవ్ టైగర్స్' పై జాగృతి




పులి వేషాలతో ప్రదర్శన

బెంగళూరు, జూలై29(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సేవ్ టైగర్స్' పేరిట మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఆర్ట్ కల్చరల్ ఎడ్యుకేషన్ ఎన్‌లైట్ ఫౌండేషన్ ఛైర్మన్ అంబికా ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. విద్యార్థులు పులుల వేషధారణతో పలు నృత్యాలు చేశారు. సమాజానికి సందేశం ఇచ్చేలా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## మైనర్లకు బైకులిస్తే చర్యలు: సీఐ

శిడ్లఘట్ట, జూలై 29(ఆంధ్రజ్యోతి): మైనర్లకు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు ఇవ్వడం ద్వారా అనుకోని ప్రమాదాలు, వాటి అనర్థాల గురించి చట్టరీత్యా చర్యలపై సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటైన జాగృతిలో ఆయన మైనర్లకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులకు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. 18ఏళ్లలోపువారు మోటారు వాహనాలు నడపరాదన్నారు. కొంతమంది వీలింగ్ ద్వారా ఇతరులకు ఇబ్బంది కలిగిస్తుంటారని, వారిపై కూడా చర్యలు ఉంటాయన్నారు. ఇలా ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించినందుకు 20కుపైగా వాహ నాలను సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా టౌన్ ఎస్సై వేణు గోపాల్, సిబ్బంది నటేశ్, నవీన్, చీతా రాజేశ్, మేఘ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

# దుకాణంలో మంటలు.. రూ.30 లక్షల నష్టం

చింతామణి, జూలై 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చేళూరు రోడ్డులోగల ఆరెప్ప అనే వ్యక్తికి చెందిన ప్లేనింగ్ అండ్ డిజైన్ మిషన్ దుకాణం, గోడౌన్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసు కుంది. సుమారు 30 లక్షల రూపాయల విలువైన కొయ్య సామగ్రి ఆహుతైంది. గోడౌన్ పైకప్పు కూలిపోవడంతో నష్టం మరింత అధికమైంది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా దుకాణంలో మంటలు చెలరేగినట్టు తెలుస్తోంది. రెండు ప్లేనింగ్ మిషన్, కొయ్యల డిజైన్ చేసే మిషన్, డ్రిల్లింగ్ మిషన్ సహా పలు విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. సదరు గోడౌన్ సీవీ బాబుకు చెందినది, అయితే వాటిని ఆరెప్ప 25ఏళ్లుగా బాడుగకు తీసుకుని నిర్వహిస్తున్నారు. ప్రమాదం సమాచారం తెలిసిన వెంటనే చింతామణి అగ్ని మాపకశాఖ అధికారి లోకేశ్, సిబ్బంది కార్యాచరణలో పాల్గొన్నారు. శిడ్లఘట్ట నుంచి కూడా ఫైరింజన్‌లు రప్పించారు. ఎలాంటి ప్రాణనష్టం లేకపోవడం ఒకింత ఊరటనిచ్చే అంశం. మంటలు ఆర్పడానికి అగ్నిమాపక సిబ్బంది గంటల తరబడి కృషి చేశారు.



దెబ్బతిన్న దుకాణం



మంటలు ఆర్పుతున్న సిబ్బంది

# ఐటీఐ కళాశాల విద్యార్థుల ఆందోళన

గోరంట్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవెంకటసాయి ఐటీఐ కళాశాల విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో యజమాన్యంతో విభేదించి కళాశాల వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిపు మొత్తాన్ని తీసుకుని, ఫీజుల పేరుతో వేధిస్తున్నారని ధీరజ్, సాయిక్రిష్ణ, చరణ్, జహీర్, సిద్దార్థ, రోహిత్, బిలాల్, నంద, అఫ్జల్, పవన్, నాగార్జున ఆరోపించారు. గత ప్రభుత్వం విద్యాదీవేన పేరుతో తల్లుల ఖాతాలో మొత్తం జమ చేయగా, కూటమి ప్రభుత్వం కళాశాలల యజమాన్యం ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. యజమాన్యం ముందుగానే విద్యార్థులనుంచి ఫీజులు వసూలు చేసిందన్నారు. ఫిబ్రవరిలో ప్రభుత్వం నిధులు మంజూరుచేసినా యజమాన్యం తిరిగి ఇవ్వకుండా ఇంకా బకాయి ఉందని వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు సచివాలయాలకు వెళ్లి తమ పేరున కాలేజీకి మంజూరైన స్కాలర్‌షిపు వివరాల ప్రింట్‌ను తీసుకొచ్చి ఆందోళనకు దిగారు. ఎస్సీ, ఎస్టీలకు ఒక్కొక్కరికి రూ.16వేలు, బీసీ, ఓసీలకు రూ.8వేలు వంతున ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఫీజు కట్టిన రసీదులు తీసుకురావాలని ప్రిన్సిపాల్ శివప్పనాయక్ తెలపడంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 2 నుంచి బెంగళూరు కవితా సమ్మేళనం

బెంగళూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆటా గలాటా ఆధ్వర్యంలో తొమ్మిదో విడత బెంగళూరు కవితా సమ్మేళనం ఆగస్టు 2నుంచి రెండు రోజులపాటు జరగనుంది. ఇందిరానగర్‌లోని సంగీతసభ ప్రాంగణంలో బెంగళూరు పోయెట్రి ఫెస్టివల్ జరగనున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. సుమారు 5వేలమంది సాహిత్యాభిమానులు పాల్గొననున్నారు. ఈ ఏడాది అన్ని భాషల కవులతోపాటు ప్రపంచవ్యాప్తంగా పదాల వర్ణచిత్రాలు, పద్యం రూపంలో పాటల ప్రదర్శనలు, కవులు, గేయ రచనకారులు, గాయకులు, సంగీత విద్వాంసులు పాల్గొననున్నారు. గతంలో గుల్జార్, శుభ ముద్గాల్, శంకర్ మహదేవన్ లాంటి ప్రముఖులు పాల్గొన్నారన్నారు. ఆటా గలాటాలో పుస్తకాల స్టాల్స్ ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు సుబేద్, లక్ష్మి ప్రకటించారు. బెంగ ళూరులో జరిగే అతిపెద్ద కవితా సమ్మేళనం అన్నారు. రెండురోజులపాటు జరిగే ప్రదర్శనలకు ప్రముఖ కళాకారులు పాల్గొంటారన్నారు.

## ప్రతి శుక్రవారం నృత్య ప్రదర్శనలు

బెంగళూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా ఆగస్టులో శుక్రవారం నిర్వహించే నృత్య ప్రదర్శనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. భారతీయ విద్యాభవన్‌లో ఆగస్టు 1, 8, 15, 22, 29 తేదీలలో ప్రత్యేక ప్రదర్శనలు సాయంత్రం 6.30 గంటలకు ఏర్పాటు చేస్తున్నారు. తొలిరోజున జీవీ సురభి భరతనాట్య ప్రదర్శన కొనసాగనుంది. గురువు శాలిని శ్రీకాంత్ పర్యవేక్షణలో సురభి శిక్షణలు పొందారు. 8న వీ రంజిత కథక్ యుగళ నృత్యం, 15న ఆశాకుమార్ భరతనాట్యం, 22న డాక్టర్ కేసీ కవన భరతనాట్యం, 29న ఎంవీ సౌందర్య భరతనాట్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

## విజేత బెంగళూరు మహిళ



టైటిల్‌తో శారదా నారాయణన్

బెంగళూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): కాలిఫోర్నియాలో జరిగిన శ్రీమతి క్లాసిక్ గ్లోబ్ చాయిస్ ఆఫ్ ది పీపుల్ పోటీలో బెంగళూరుకు చెందిన శారదా నారాయణన్ ఛాంపియన్‌గా నిలిచారు. కాలి ఫోర్నియాలోని పామ్‌స్ప్రింగ్స్ వెస్టిన్ రాంచో మిరాజ్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలెలో ఛాంపియన్ అయ్యారు. మహిళా స్వావలంబన, సుస్థిరమైన ఫ్యాషన్‌రంగంలో సాధనలకు ఆమెకు టైటిల్ దక్కింది. ప్రాథమికస్థాయిలో కుటుంబ విలువలకు సంబంధించిన అంశాలలో రాణించారు. తల్లిగా, పారిశ్రామికవేత్తగా, మార్గదర్శకురాలిగా శక్తి, సానుభూతి, సమగ్రత పరంపర, మహిళల ఎదుగుదలతో సాధ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. ఛాంపియన్‌గా నిలిచిన మేరకు ఇది కేవలం నా విజయం కాదని ఓ మహిళగా ఎందరో సహకారంతో సాధ్యమైందన్నారు. శారదా నారాయణన్ మహిళా స్వావలంబనకోసం వీర్యా ట్రస్టు పేరిట ఎన్జీఓ నిర్వహిస్తున్నారు. ఫ్యాషన్ లేబుల్ మెటా మార్ఫసిస్ అనే బోటిక్‌ను కలిగి ఉన్నారు.

## నాగరబావిలో ప్రమాదకరంగా కల్వర్టు



దెబ్బతిన్న కల్వర్టు

బెంగళూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): రోడ్డుకు అనుబంధంగా ఉండే రాజకాలువలకు పూర్తిస్థాయి భద్రతతో గోడలు నిర్మించాల్సి ఉంది. ఏ చిన్న ప్రమాదం జరిగినా పెనుముప్పు వాటిల్లుతుందని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. నాగరబావి 12వ బ్లాక్‌లో ప్రధాన రహదారికి అనుబంధంగా రాజకాలువ ఉంది. ఈ మార్గంలో బస్సుతోపాటు అన్ని రకాల వాహనాలు వందలసంఖ్యలో సంచారం చేస్తుంటాయి. రెండువైపులా వాహనాలు వచ్చేందుకు వీలుండడంతో తరచూ రద్దీ ఉంటుంది. రాజకాలువకు అనుబంధంగా ఉన్న కల్వర్టు గోడ పూర్తిగా దెబ్బతింది. ఏమాత్రం అదుపు తప్పినా కాలువలోకి వాహనాలు పడిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా బీబీఎంపీ అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## కర్ణాటక మద్యం నియంత్రణకు గట్టి నిఘా

**- ఎక్సైజ్ శాఖ డీసీ నాగమద్దయ్య**



మడకశిర పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీ

మడకశిర టౌన్, జూలై29(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో ఆ రాష్ట్ర మద్యం రాకుండా గట్టి నిఘా పెట్టాలని అనంతపురం ఎక్సైజ్ శాఖ డీసీ నాగమద్దయ్య ఆదేశించారు. మంగళవారం అసిస్టెంట్ ఏసీ శ్రీరాంతో కలసి స్థానిక ఎక్సైజ్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు గ్రామాల్లో నాటుసారా తయారీపై నిఘా ఉంచాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం విక్రయిస్తున్నారా లేదా అని ఆరాతీశారు. కర్ణాటక మద్యం తరలింపుపై కేసులు నమోదు, నాటుసారా, కల్లుదుకాలపై ఎన్ని కేసులు నమోదు చేశారు అని అడిగి తెలుసుకున్నారు. ఎక్సైజ్ సీఐ మురళి కిషోర్ సిబ్బంది పాల్గొన్నారు. హిందూపురం: కర్ణాటక మద్యం తెస్తూ మూడోసారి పట్టుబడితే పీడీ యాక్ట్ నమోదుచేయాలని ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసులపై ఆరాతీశారు. ఏసీ శ్రీరామ్, ఎస్ఐ ఉన్నారు.



## తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1624.62 | 1,630.88 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 1.27,810 | 1,47,122 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 1.24,487 | 1.56.248 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 75.26 | 97.41 |



ఆలయ సమీపంలోని కొండపై ఎలుగుబంటి

## జంబునాథ ఆలయంలో ఎలుగుబంటి సంచారం

● భయాందోళనలో పూజారులు, భక్తులు

బళ్లారి సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): హొసపేట నగర శివారులోని జంబునాథ ఆలయ కొండపై నాలుగు రోజులుగా ఎలుగుబంటి సంచారంతో పూజారులు, భక్తులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి ఎనిమిది గంటలకు ఓ ఎలుగబంటి ఆలయ పరిసరాల్లో సంచరించింది. శబ్దం చేయడంతో పారిపోయిందని, మంగళవారం మళ్లీ గర్భగుడిలోకి వచ్చి వెనుదిరిగినట్లు పూజారి ఆనందస్వామి తెలిపారు. ఎలుగుబంటి సంచారంతో బెంబేలెత్తిపోతున్నామని, దాదాపు 20మంది పూజారులు కుటుంబంతో ఇక్కడ నివశిస్తున్నామన్నారు. మాప్రాణాల గురించే కాకుండా 400మెట్లు ఎక్కి స్వామి సన్నిధికి చేరుకునే భక్తుల గురించి ఆలోచించి ఆటవీ శాఖ వెంటనే ఎలుగుబంటిని పట్టుకోవాలని వారు కోరారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

చెల్లకెర, జూలై 29(ఆంధ్రజ్యోతి): చెల్లకెర పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు, అలాగే కార్డియాపరిక్షలు, ఇతర ఆరోగ్యపరమైన పరిక్షలు నిర్వహించారు. ఈ సంర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రకాష్ మాట్లాడుతూ క్లబ్ తరుపున ప్రతి ఏటా కంటి పరిక్షలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. క్లబ్ నిజాయితీతో ప్రజలకు సేవలు చేయడానికి ముందుకొస్తుందని తెలిపారు. వీరితోపాటు కార్యదర్శి జయప్రకాష్, మాజీ అధ్యక్షుడు నాగేష్ ఇతర వైద్యులు పాల్గొన్నారు.

## చెత్త వాహనం ఢీకొని బాలుడి మృతి



విక్కీ(ఫైల్)



చెత్త వాహనం

బళ్లారి రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): నగరంలో బాపూజీనగర్‌లో మున్సిపల్ కార్పొరేషన్ చెత్త సేకరణ వాహనం ఢీకొని మంగళవారం బాలుడు విక్కీ(3) మృతి చెందాడు. నగరంలోని బాపూజీనగర్‌కు చెందిన సమర, శైలజ దంపతుల కుమారుడు రోడ్డు పక్కన ఆడుకుంటున్న సమయంలో బాలుడిపై వాహనం వేగంగా దూసుకెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాలుడిని ఆస్పత్రికి తీసుకెళ్లే లోపే కన్ను మూసినట్లు తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని వారు వాపోయారు. కుటుంబ సభ్యులను ఓదార్చిన మేయర్ నందీష్ వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# మెదడును సంరక్షించుకోవడం అందరి బాధ్యత

● శరీరంలో నాడీవ్యవస్థకు అదే మూలం ● ఒత్తిడికి గురి కారాదు ● ప్రపంచ బ్రెయిన్ డేలో సర్జన్ డాక్టర్ బసారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ బసారెడ్డి

బళ్లారి సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి):మానవ శరీరంలో మెదడు అతి ముఖ్యమైన అవయమని, మెదడు ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని జిల్లాసర్జన్ డాక్టర్ బసారెడ్డి అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, కర్ణాటక బ్రెయిన్ హెల్త్ ఇనిషియేటివ్, జిల్లా ఆసుపత్రి బ్రెయిన్ హెల్త్ ట్రీట్‌మెంట్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ 'మెదడు దినోత్సవం 2025' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శరీరంలో మెదడు అతి ముఖ్యమైన అవయమని, మెదడు పనిచేయకపోతే మానవులు పరాన్న జీవులుగా మారక తప్పదన్నారు. న్యూరాలజీకి సంబందించిన ఆరోగ్య వ్యాదులు పెరగుతున్నందున ప్రభుత్వం ఈ ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందన్నారు. తలనొప్పి, స్ట్రోక్, మూర్చ తదితర వ్యాదులు, చిత్తవైకల్యం వంటివి ఎదురైతే వెంటనే వైద్యుడిని సందర్శించి ఉచిత తనిఖీ చేయించుకోవాలని సూచించారు.జిల్లాలో బ్రెయిన్ హెల్త్ ప్రోగ్రామ్ కింద 2024 నుండి 2025జూన్ వరకు 19,000 మంది లబ్దిదారులు బ్రెయిన్ హెల్త్ క్లీనిక్‌లో ఉచిత చికిత్స పొందారని ఆయన వివరించారు. బ్రెయిన్ హెల్త్ ట్రీట్‌మెంట్ అందించడంలో బళ్లారి ఇతర జిల్లాల్లో మెదటి స్థానంలో ఉండటం గర్వకారణమన్నారు. బ్రెయిన్ హెల్త్ ప్రోగ్రామ్ కింద బ్రెయిన్, నరాల సంబంధిత రోగులకు క్రమం తప్పకుండా చికిత్స, మందులు అందిస్తున్నారు. రోజు ఒత్తిడితో కూడిన పని ఉన్నప్పటికీ ఎనిమిది గంటలు నిద్రపోవాలన్నారు. మానసికంగా దృఢంగా ఉండాలంటే ఒత్తిడిని నియంత్రించుకోవాలని,ధూమపానం, మద్యం మానేయాన్నారు. జిల్లాకుష్టువ్యాది నిర్మూలన అధికారి డాక్టర్ వీరేంద్రకుమార్ మాట్లాడుతూ మెదడు ఆరోగ్యంగా ఉండాలంటే మన శరీరం శారీరకంగా మానసికంగా బలంగా ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా ఉండకూడదూ, అన్ని ప్రభుత్వ సంస్థలు ,ఆరోగ్య నిపుణులు సంరక్షకులు పౌరులలో మెదడు ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి ప్రపంచ మెదడు దినోత్సవాన్ని జరుపుకుంటారన్నామన్నారు. ఈసందర్భంగా బ్రెయిన్ హెల్త్ ట్రీట్ మెంట్ సెంటర్ నిర్వహించిన బ్రెయిన్ స్టిమ్యులేటింగ్ యాక్టివిటీ పోటీ విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈసందర్బంగా జిల్లా క్షయ నిర్మూలన అధికారిణి డాక్టర్ ఇంద్రాణి, జిల్లాఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ఆఫీసర్ డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ శ్రీధర్, బ్రెయిన్ ట్రీట్‌మెంట్ నోడల్ ఆఫీసర్ రాకేశ్, జిల్లా ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ ఆఫీసర్లు దురుగప్ప, రజియా బేగం, కర్ణాటక బ్రెయిన్ హెల్త్ ఇనిషియేటివ్ ప్రోగ్రామ్ జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సన్నకేశవ, ఫీల్డ్ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఖుర్షీద్ బేగం, బ్రెయిన్ హెల్త్ ట్రీట్‌ంట్ సెంటర్ సిబ్బంది, వైద్య విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధి కమిటీ ఎన్నిక



దేవలాపురం ప్రభుత్వ పాఠశాల వద్ద నూతన కమిటీ సభ్యులు

కంప్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): తాలుకా సమీపంలోని దేవలాపురం గ్రామంలో ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి సమితి పదాధికారులు నియామకం, ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్, ప్రముఖుల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. 18 మంది సభ్యులను ఎన్నుకోగా అందులో నుంచి ఇద్దరిని అధ్యక్ష ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివరాజ్‌కుమార్ ఉపాధ్యక్షుడిగా కురి హనుమంతమ్మ శివరాజను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి గ్రామ ప్రముఖులు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు పూజారి వీరమ్మ, రమేష్ ఉపాధ్యక్షులు నాగరాజు, కుంభర విరుపాక్షప్ప, మల్లికార్జున వడ్డెర, జడప్ప, సీడీ కుమారస్వామి, కురికరిబసప్ప, సురేష్ గౌడ్, ఉమేష్ గౌడ, సిద్దయ్య పంపాపతి గంగాధర, శివకుమార్ పాల్గొన్నారు.

### కేబుల్ చోరీ

అమరాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలంలోని హేమావతి గ్రామంలో తాగునీటికి అమర్చిన విద్యుత్ కేబుల్‌ను మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబు తెలిపారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు స్టార్టర్లు, కేబుళ్లు చోరీకి గురవుతున్నాయని, చుట్టూ బాక్సును ఏర్పాటుచేసి భద్రపరిచినా దొంగలిస్తున్నారన్నారు. స్థానిక నాయకులతో కలిసి ఎస్ఐ ఇషాక్‌బాషాకు ఫిర్యాదు చేశామన్నారు.

## తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

● మూసేసిన వంతెనలపై ప్రయాణించరాదు
● తుంగభద్ర ఉధృతి పెరిగే అవకాశం: కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి నదిలోకి లక్ష క్యూసెక్కుల నీటిని నీటిని విడుదల చేయడంతో నదీ తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయం కేశ్వన్ వీడియో హాల్లో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగావతి ఫ్లైఓవర్ మీదుగా నీరు ప్రవహిస్తుందున ముందుజాగ్రత్తగా వాహనాల రాకపోకలను నిలిపివేశామని, వాహనదారులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను తరలించడానికి పడవలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో మళ్లీ వర్షాలతో నీటి ఉధృతి పెరిగే ప్రమాదం ఉందన్నారు. కంప్లి తాలూకా తహసిల్దార్, ఆర్ఐ అధికారులు రోజువారీ నీటి మట్టాన్ని తెలుసుకోవాలని, ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆహారం, మందులు అందజేయాలన్నారు. ఈసందర్బంగా అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్, వివిధ జిల్లాస్థాయి శాఖల అధికారులు తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్ వర్ధంతి

బళ్లారి సిటీ,జూలై 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విమ్స్ గ్రౌండ్‌లో ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్ 134వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈసందర్బంగా ఏఐడీఎస్ఓ జిల్లా అధ్యక్షుడు ఈరన్న మాట్లాడుతూ.. వలస పాలనలో చాలా కాలంగా అజ్ఞానం, మూర్ఖత్వం యొక్క చీకటిలో మునిగిపోయిన భారతదేశ భూమికి ఆధునిక జ్ఞానం వెలుగును తీసుకువచ్చిన సూర్యుడు, గొప్ప లౌకిక మానవతావాది ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్ అన్నారు. శతాబ్దాలుగా విద్యకు దూరమైన మహిళలు, దిగువ తరగతి వర్గాలకు విద్యను అందించడానికి, బాల్యంలోనే వితంతువుగా మారిన బాలికల పునర్వివాహం కోసం ఆయన అవిశ్రాంతంగా కృషి చేశారన్నారు. అంతేకాకుండా పాత , కఠినమైన సంప్రదాయాల సంకుచిత మనస్తత్వ ఆలోచనలకు వ్యతిరేకంగా పోరాడిన మహోన్నత వ్యక్తి అని, పునరుజ్జీవనోద్యమ ఉద్యమ జెండాను ఆయన ఎగురవేశారన్నారు. నేడు విద్యను ప్రైవేటీకరించి అమ్మేస్తున్నారు. వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూతబడుతున్నాయి. రాష్ట్రంలో 7.000 కంటే ఎక్కువ సింగిల్ టీచర్ పాఠశాలలు ఉన్నాయి. 3500 కంటే ఎక్కువ పాఠశాలల్లో సరైన టాయిలెట్లు ,తాగునీటి సౌకర్యాలు లేవు. చాలా పాఠశాల భవనాలు సంవత్సరాలుగా మరమ్మతులు చేయకపోవడంతో పైకప్పులు లీక్ అవుతున్నాయన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 59,000 కి పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 29,000కిపైగా ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే దశలో ఉన్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అసంఖ్యాక విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. పేద రైతులు, కార్మికులు,మధ్యతరగతి ఆణచివేతకు గురవుతున్నారన్నారు. పిల్లలు, వృద్ధులపై అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. విద్యాసాగర్ ఆదర్శాలతో పోరాడి శాంతియుత, స్వచ్ఛమైన సమాజం సాధించాలన్నారు. ఈ సందర్బంగా జిల్లా ఆఫీస్ బేరర్లు కాంతేశ్, తిప్పేస్వామి ఉన్నారు.





మాట్లాడుతున్న ఏఐడీఎస్ఓ పదాధికారులు

## రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముడి దుర్మరణం

● చెల్లకెర వద్ద కారు, బైక్ ఢీ.. విషాదంలో కుటుంబ సభ్యులు



మంజుల, అభిషేక్ (ఫైల్)

చెల్లకెర, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చెల్లకెర పట్టణ సమీపంలోని స్టేట్ హైవే 150ఏ పై మంగళవారం కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో అక్కదమ్ముడు దుర్మరణం చెందారు. చెల్లకెర పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం చెల్లకెర తాలూకా తలకు గ్రామ పంచాయితీ సభ్యుడు రవికుమార్ భార్య మంజుల(32) ఆమే తమ్ముడు అభిషేక్(28) ఇద్దరూ ద్విచక్రవాహణంలో దేవరకోట మొరార్జీ స్కూల్‌కు వెళ్తున్నారు. 6వ తరగతి చదువుతున్న మంజల అబ్బాయి అనిల్‌ను చూసి వస్తున్నారు. సరిగ్గా ఎదురుగా వస్తున్న కారు వేగంగా ఢీ కొట్టడంతో వీరు రోడ్డు నుంచి పోలాల్లోకి దూసుకుపోయారు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం హ్యాండిల్ పూర్తిగా కట్ అయింది. తీవ్రగాయాలతో వారిద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కారు ముందు బాగం కూడా దెబ్బ తింది. కారు డ్రైవర్‌కు గాయాలు కావడంతో చెల్లకెర ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుమారుడిని చూసి ఇంటికి వస్తున్నాము అని భర్తకు ఫోన్‌లో చెప్పిన కొద్ది సేపటికే ప్రమాదం వీరి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. పోలీసులు కేసున మోదు చేసుకున్నట్లు తెలిపారు. అక్కతమ్ముడు ఒకేసారి ప్రమాదంలో మరణించడంతో ఆకుటుంబంలో విషాదం నెలకొంది.



దెబ్బతిన్న బైక్

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● జిల్లా క్రీడా సంఘం అధ్యక్షుడు ముత్తేగౌడ





జిల్లాస్థాయి యోగా పోటీలో ప్రతిభ చాటిన విద్యార్థులు

కంప్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): యోగాతో శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని బళ్లారి జిల్లా యోగాసన కీడ్రా సంఘం అధ్యక్షుడు ముత్తేగౌడ అన్నారు. మంగళవారం ఎస్‌జీఆర్‌సీఎం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ యూత్ ఎంపవర్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ చాంపియన్ షిప్ సహకారంతో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. బాల్యంలో యోగా, ధ్యానం, ప్రాణాయామం సాధనతో పిల్లల్లో ఆరోగ్యం, జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందన్నారు. కంప్లి యక్ష యోగా ఇన్‌స్టిట్యూట్ నుంచి జిల్లాస్థాయి యోగా స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్‌లో 17 మంది పిల్లలు పాల్గొన్నారన్నారు. 12 మంది జిల్లాస్థాయిలో మొదటి స్థానాన్ని సాధించడం హర్షణీయమన్నారు. యోగా పోటీల్లో యోగేష్, మణికాంత్, శశంక్ మూడు బంగారు పతకాలు గెలుచుకున్నారని, కగ్గల్ లోకేష్ మొదటి స్థానం గెలుచుకోవడం ద్వారా రెండు బంగారు పథకాలు సాధించారన్నారు. జిల్లాస్థాయిలో బాలికలలో ఎస్ భూమిక, సీ నయన, ఫస్ట్ పొజిషన్ స్వర్ణపతకాలు గెలుచుకుంది. కంప్లి యక్ష యోగా వ్యవస్థాపకురాలు శ్యామలమ్మ, సంస్థకు కీర్తిని తెచ్చారు. కర్ణాటక యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

హొస్పేట,జూలై29(ఆంధ్రజ్యోతి): కర్ణాటక స్టేట్ ఓపెన్ యూనివర్శిటీ నూతనంగా ప్రారంభించబడిన కమలాపూర్ (హొస్పేట్) ప్రాంతీయ కేంద్రంలో 2025-26 విద్యాసంవత్సరానికి అండర్ అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రాంతీయ డైరెక్టర్ ఎం ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం జిల్లాలోని ఆసక్తిగల విద్యార్థులు, తల్లిదండ్రులు ఇంట్లో కూర్చుని ప్రైవేట్, ప్రభుత్వ సెమీ-గవర్నమెంట్ విభాగాలలో పనిచేస్తూ దూరవిద్య విధానంలో చదువుకోవడానికి వీలుగా స్టేట్ ఓపెన్ యూనివర్శిటీ ఫస్ట్ బీఏ, బీకాం, బీఎస్సీ, బీలిబ్, ఐఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యు, ఎంఎ కన్నడ, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, తెలుగు, ఉర్దూ, చరిత్ర, ఆర్థిక శాస్త్రం, రాజకీయశాస్త్రం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషయాలజీ, ప్రాచీన చరిత్ర, పురావస్తు ఆధ్యాయనాలు, విద్య, ఎంఏ జర్నలిజం, మాస్‌కమ్యూనికేషన్ ఎంఏ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, బయాలజీ. ఆంత్రోపాలజీ తదితర కోర్సులలో అడ్మిషన్లను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా మంజూరు చేస్తారు. మైనార్టీ విద్యార్థులకు ఉచిత ప్రవేశం, మైనార్టీ సంక్షేమ శాఖ ముస్లిం, క్రైస్తవ, జైన్, బౌద్ధ, సిక్కు, పార్సీ వర్గాలకు చెందిన మైనార్టీ విద్యార్థులకు ప్రాంతీయ కేంద్రాల ద్వారా మొదటి బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎల్‌బీ, ఐఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యు, అలాగే ఎంఏ, ఎంసీఏ, ఎంఎస్సీ డిగ్రీ కోర్సులకు ఉచిత ప్రవేశం అన్నారు.

### మైనార్టీ వివాహ ప్రోత్సాహకాలకు..

2025-26 సంవత్సరానికి ఆర్థికంగా వెనుకబడిన మైనార్టీ వర్గాలకు సాధారణ వివాహాలను ప్రోత్సహించడానికి స్వచ్ఛంద సంస్థల ద్వారా జరిగే సామూహిక వివాహాల ఖర్చుల కోసం ప్రతి జంటకు రూ. 50వేలు అందించబడుతుందని మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు హొస్పేట్ సెల్: 8050435366, కుడ్లిగి,కొత్తూర్ సెల్: 9060330060, హరపనహళ్లి సెల్: 8494927891, హువినహడగళి సెల్: 7353696984, హగనిబొమ్మనహళ్లి సెల్: 9980237242 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

### ఫిజియోథెరపిస్ట్ పోస్టులకు..

2025-26 సంవత్సరంలో సమన్వయ విద్యా జోక్య కార్యకలాపాల అమలుకు సంబంధించి హొస్పేట్ తాలూకాలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపిస్ట్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయని హొస్పేట్ ఏరియా కోఆర్డినేటర్ ఎం శివకుమాంర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరఫీ ఉత్తీర్ణులై ఉండాలి, ఆగస్టు 4లోపు దరఖాస్తులను ఫీల్డ్ రిసోర్స్ సెంటర్(బీఆర్‌సీ)కు వ్యక్తిగతంగా సమర్పించాలి. దరఖాస్తును పోస్ట్‌ద్వారా సమర్పించలేరు. దరఖాస్తుచేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 5న ఫీల్డ్ రిసోర్స్ సెంటర్‌లో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9480695078 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

## అభివృద్ధి పనులకు పురసభ ఆమోదం



మున్సిపాల్టీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ శిల్ప

చెల్లకెర, జూలై 29(ఆంధ్రజ్యోతి): చెల్లకెర మున్సిపాల్టీ పరిదిలో పలు అభివృద్ధి పనులకు కమిటీ ఆమోదించింది. మంగళవారం జరిగిన మున్సిపాల్టీ సర్వసభ్యసమావేశానికి చైర్‌పర్సన్ శిల్పా అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పలు సమస్యలపై ప్రశ్నించారు. పలు వార్డుల్లో కనీసం మౌలిక సదుపాయాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు చైర్‌పర్సన్ శిల్ప మాట్లాడుతూ.. మున్సిపాల్టీ, ఎమ్మెల్యే నిధులతో పనులు చేపడ్తామన్నారు. ఇందుకు అభివృద్ధి పనులు ప్రతిపాదనలు తెలిపారు. ఎమ్మెల్యే రఘుమూర్తి సలహాలు సూచనలతో చెల్లకెర పట్టణం అభివృద్దినిధులు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు కవితా బోరయ్య, సుజాత, కవిత, జయలక్ష్మి, చల్లాకేరప్ప. వీరేశ లగొవింద, తదితలరు పాల్గొన్నారు.

# హోసూరు జోన్



మొక్కలు నాటుతున్న మేయర్ సత్య

## పచ్చదనానికి ప్రాధాన్యం: మేయర్

హోసూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): పచ్చదనానికి ప్రాధాన్యం ఇచ్చేలా స్వచ్ఛంద సంస్థలు సహకారం అందిస్తున్నాయని మేయర్ సత్య అభిప్రాయపడ్డారు. లూమినస్ కార్పొరేషన్ సంస్థ తమ సీఎస్ఆర్ నిధుల కింద రూ.3లక్షల ఖర్చుతో 41వ నెంబరు వార్డులో రాయకోటై ప్రాంతంలో 500 మొక్కలను మంగళవారం నాటారు. కార్పొరేషన్ మేయర్ సత్య లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ ఆనందయ్య, ఆరోగ్యస్థాయి కమిటీ అధ్యక్షుడు మాదేశ్వరన్, కౌన్సిల్ సభ్యుడు శంకర్, లూమినస్ సంస్థ అసిస్టెంట్ చైర్మన్ సుదర్శన్ పిళ్లై, హెచ్‌ఆర్ విభాగం మేనేజర్ అటానయ్ కుమార్, పార్టీ నేత సుకుమారన్ పాల్గొన్నారు.

## మారియమ్మ ఆలయంలో విశేష పూజలు

హోసూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): బాగలూరు గ్రామం సమీపాన కొట్టాయి మారియమ్మ ఆలయంలో మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. ఇక్కడి అమ్మవారు భక్తుల కొంగుబంగారంగా పేరొందారు. పేదరికం, కష్టాలనుంచి గట్టెక్కిస్తారని భక్తులు విశ్వసిస్తారు. భక్తులు కళశాలతో ఊరేగిం మొక్కులు తీర్చుకున్నారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్త బృందం

## పరిశ్రమల్లో సాంకేతిక పురోగతి హర్షణీయం: కలెక్టర్



నోరెక్స్ పరికరాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

హోసూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో సాంకేతిక పురోగతి సాధించడం హర్షణీయమని కలెక్టర్ దినేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం సిప్‌కాట్ ప్రాంతంలోని నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్ మేడ్ ఈజీ 1.0 అనే అంశంపై వ్యవస్థాపకులకోసం ప్రత్యేక సదస్సు జరిగింది. కృష్ణగిరి కలెక్టర్ దినేశ్‌కుమార్ యంత్రాల సామర్థ్యం గుర్తించే 'నోరెక్స్' అనే పరికరాన్ని ఆవిష్కరించారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వం పారిశ్రామిక ఉత్పత్తిలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను ప్రవేశపెట్టడం ద్వారా రాష్ట్రానికి విదేశీ పారిశ్రామిక పెట్టుబడులను తీసుకురావడానికి తీవ్రంగా కృషి చేస్తోంది. తద్వారా తమిళనాడు యొక్క ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని సాధించే లక్ష్యంతో వ్యవస్థాపకుల కోసం ఇటువంటి ప్రేరణాత్మక సెమినార్లు జరుగుతున్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ తయారీ రంగంలో సాంకేతిక అభివృద్ధి కోసం ప్రస్తుతం లెక్కలేనన్ని శాస్త్రీయ పరిణామాలు జరుగుతున్నాయన్నారు. గతంతో పోలిస్తే తయారీ చాలా సరళీకృతమైందన్నారు. ప్రత్యేకించి త్రీడీ ప్రింటింగ్‌లో ఎంతో ప్రగతి సాధించిందన్నారు. స్మార్ట్ తయారీ టెక్నాలజీతో పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. అడియమాన్ కళాశాలలో నైపుణ్య అభివృద్ధి కేంద్రం విద్యార్థులకు తమ నైపుణ్యాన్ని పెంచేలా తర్ఫీదు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. సదస్సులో పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

## నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

మడకశిర టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ తెలుగుదేశం పార్టీ కైవసం అయ్యాక బుధవారం తొలి కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. వైసీపీ పాలనలో నగర పంచాయతీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని కొంత మంది వైసీపీ కౌన్సిలర్లు తాము గెలిచిన వార్డులలో పర్యటించలేక పోతున్నమని స్వచ్ఛందంగా టీడీపీ తీర్థం పుచుకొన్నారు. దీంతో చైర్మన్ మార్పు అనివార్యం కాగా 15వ వార్డు కౌన్సిర్ నరసింహరాజు చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన బాధ్యతలు స్వీకరించాక తొలి కౌన్సిల్ సమావేశం జరగుతుండడంతో ప్రత్యేకత సంతరించుకుంది. నగర పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక చర్చ సాగే అవకాశం ఉంది. నగర పంచాయతీ అభివృద్ధిపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఇప్పటికే ఎమ్మెల్యే అబివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెడుతూ సొంత నిధులతో తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోర్లు వేయించారు. ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం కోసం అధికారులకు సూచనలిస్తూ గతంకన్నా భిన్నంగా ఉండాలని ఆదేశిస్తూ వచ్చారు. సమావేశంలో కీలకంగా చర్చించి అందుకు అనుగుణంగా ముందుకు సాగనున్నారు.

**నేడు ఎమ్మెల్యే పర్యటన:** ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఉదయం 11గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో జరిగే కౌన్సిల్ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 12గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలోని బాలికోన్నత పాఠశాలలో జరిగే స్కూల్ కమిటీ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగే హెచ్‌డీఎస్ సమావేశంలో పాల్గొంటారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు.

